


ఉందిలే మంచికాలం..

రాజధాని తర్వాత రెండో శ్రేణి నగరంగా ఖమ్మం ● రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఆర్థిక మంత్రి భట్టి





'విద్యుత్' అంబులెన్స్ సర్వీసులు

విద్యుత్ సంబంధిత సమస్యలపై హైదరాబాదులో నిర్వహిస్తున్న 'విద్యుత్' అంబులెన్స్ సేవలు ఇప్పుడు జిల్లాలకు కూడా విస్తరించబోతున్నారు. ఇందుకోసం 1912 టోల్‌ఫ్రీనెంబర్‌ను ఏర్పాటుచేసి విద్యుత్ సమస్యలపై ఫోన్‌చేస్తే వెంటనే అంబులెన్స్ ద్వారా ఏఈ, సిబ్బంది బాధితుల ఇంటికి వెళ్లి సమస్యను పరిష్కరిస్తారు. రోజులో 24గంటలు ఈ సేవలు అందుబాటులో ఉంటారు. ఈ అంబులెన్స్‌లో ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎప్పుడూ సిద్ధంగా ఉంచుతారు. హైదరాబాదులో 57సబ్‌స్టేషన్ల పరిధిలో ప్రస్తుతం ఈ పథకం అమల్లో ఉంది. ఇప్పుడు ఈ పథకం జిల్లాలోని మండలాలకు రాబోతోంది.

- నగరం సర్వతోముఖాభివృద్ధి సాధించేందుకు బాటలు
- వ్యవసాయాధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం
- ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు భారీగా నిధులు
- 'విద్యుత్' అంబులెన్స్ సర్వీసులు అందుబాటులోకి
- 'సీతారామ'కు ఆశించిన మేర దక్కని కేటాయింపులు
- అభివృద్ధికి భరోసానిచ్చిన ఆర్థిక బడ్జెట్

ఖమ్మం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అభివృద్ధి, సంక్షేమం ప్రాధాన్యంగా ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో రైతుకు భరోసా కల్పించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన నీటిపారుదల ప్రాజెక్టుల తక్షణ అవసరాలకు నిధులు కేటాయించినా సీతారామ' వంటి ప్రాజెక్టులకు కేటాయించిన నిధులు నామమాత్రంగానే ఉన్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు అవసరమైన మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్న అసంతృప్తి పలు వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.

ద్వితీయ శ్రేణి నగరంగా ఖమ్మం

అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా హైదరాబాదు తర్వాత రెండో శ్రేణి నగరంగా ఖమ్మంను గుర్తిస్తూ ఆర్థికశాఖ మంత్రి భట్టి చేసిన ప్రకటన జిల్లా అభివృద్ధికి మరింత ఊతం ఇవ్వనుంది. హైదరాబాద్ తరువాత వరంగల్, ఖమ్మం, నిజామబాద్ నగరాలను రెండోశ్రేణి నగరాలుగా తీర్చిదిద్దుతామని భట్టి భరోసా ఇచ్చారు. జిల్లాలో వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ ప్రకటన ఖమ్మం నగరం మరింతగా విస్తరించేందుకు దోహదం చేయనుంది. ఐటీహబ్ విస్తరణ వంటి పనులతో పాటు పర్యాటక అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. బడ్జెట్‌లో ఐటీరంగానికి రూ.774కోట్లు కేటాయించారు. ఖమ్మం ఐటీహబ్-2కు సుమారు రూ.30కోట్లు అవసరం ఉంది. ద్వితీయశ్రేణి నగరాల్లో ఐటీ అభివృద్ధికి కృషిచేస్తామని ప్రభుత్వం చెప్పడంతో ఖమ్మంలో రెండో ఐటీహబ్ కూడా నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.

(మిగతా 6వ పేజీలో)

'సీతారామ' ప్రాజెక్టుకు అరకొర...

బడ్జెట్‌లో నీటిపారుదల రంగానికి ప్రభుత్వం రూ.23,373కోట్లు కేటాయించింది. ఇందులో జిల్లాకు సంబంధించి సీతారామ ప్రాజెక్టుతో పాటు పలు ప్రాజెక్టులకు నిధులు కేటాయించినట్లు సమాచారం. నీటిపారుదలశాఖ అధికారులు సమాచారం ప్రకారం.. సీతారామకు రూ.643.04కోట్లు, సీతారామ డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌కు రూ.56.30కోట్లు, ఎర్రుపాలెం వద్ద ఎన్నెస్పీ కాలువపై ఉన్న ఎత్తిపోతలకు రూ.39.90కోట్లు, పెదవాగు ప్రాజెక్టుకు రూ.46కోట్లు, కిన్నెరసాని ప్రాజెక్టుకు రూ.13.35కోట్లు, తాలిపేరు మరమ్మతులకు రూ.7కోట్లు, వైరా ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.10కోట్లు, భక్తరామదాసు నిర్వహణకు రూ.9లక్షలు కేటాయించినట్లు తెలిసింది. అయితే సీఎం రేవంత్‌రెడ్డి సీతారామ ప్రాజెక్టును 2026 ఆగస్టు 15నాటికి పూర్తిచేస్తామని గతంలో ప్రకటించారు. ఆ గడువులోపు పనులు పూర్తి చేయాలంటే ఈ ఏడాదికి కనీసం రూ.5వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించిన నిధులు నామమాత్రంగానే ఉన్నాయి. పూర్తిస్థాయి అవసరాలకు ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే అవకాశం ఉందని ఇరిగేషన్ వర్గాలు పేర్కొంటున్నాయి.



హామీలకు అనుగుణంగా బడ్జెట్ లేదు

పోటు రంగారావు, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రూ. 3,04,689 కోట్లతో ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్ కాంగ్రెస్ ఎన్నికల హామీలకు అనుగుణంగా లేదు. కేటాయింపులు ఘనంగా కనిపించినా పాత తరహాలోనే ఉంది. ఆరు గ్యారెంటీలకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించలేదు. ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రస్తావన లేదు. విద్యారంగానికి స్వల్పంగా కేటాయింపులు పెంచినా పెద్దగా ప్రయోజనం లేదు.



ప్రజలకు ఉరితాడు బిగించేలా బడ్జెట్

కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు

భట్టి విక్రమార్క తాజా బడ్జెట్ రాష్ట్ర ప్రజలకు ఉరితాడు బిగించేలా ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీల నుంచి ప్రభుత్వం పారిపోతున్నట్లు స్పష్టమైంది. ఆరుగ్యారంటీల అమలుపై బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావన లేకపోవడమే ఇందుకు ఉదాహరణ.. రుణమాఫీ పూర్తిగా అటకెక్కించినట్టుగా ఉంది.



విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించేలా..

రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్

రాష్ట్ర బడ్జెట్ ఆర్థిక వ్యవస్థకు బలోపేతం చేయనుంది. బీఆర్ఎస్ పదేళ్ల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. ప్రజలు ఇచ్చిన అధికారంతో క్రమశిక్షణతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించింది. వ్యవసాయరంగానికి రూ.24,438కోట్లు కేటాయింపు హర్షనీయం.



ప్రజల ఆశలకు తగ్గట్టుగా బడ్జెట్ లేదు

బాగం హేమంతరావు, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు

ప్రజల ఆశలకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌లేదు. సాధ్యమైన మేరకు వాస్తవ ఆర్థిక పరిస్థితికి అనుగుణంగానే బడ్జెట్‌ను రూపొందించారు. హామీల అమలుకు రూ.56వేల కోట్లు కేటాయించడం హర్షనీయం. సాగునీటి పథకాలకు రూ.23,354కోట్లు సరిపోవు. విద్యారంగానికి 7.5శాతం, వైద్య రంగానికి 6శాతమే నిధులు కేటాయించటం సరికాదు.

రెండు చోట్ల వైకుంఠధామాలు

- ఖమ్మం, సత్తుపల్లిలో భారీ ఎత్తున నిర్మాణం: మంత్రి తుమ్మల

ఖమ్మం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) మనిషి మరణించిన తర్వాత చివరి మజిలీ శ్మశాన వాటికేనని, అవి అన్ని సౌకర్యాలతో మానసిక ప్రశాంతత కలిగించేలా ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఖమ్మం, సత్తుపల్లిలో వైకుంఠధామాల నిర్మాణంపై హైదరాబాదులో సమీక్షించారు. నల్గొండ, సూర్యాపేట మోడల్‌లో వైకుంఠధామాలు నిర్మించాలని, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో పాటు కేఎంసీ కమిషనర్ అగస్త్య, సత్తుపల్లి కమిషనర్ నర్సింహను ఆదేశించారు. ఈ రెండు వైకుంఠధామాలు రాష్ట్రానికి మోడల్‌గా నిలవాలని సూచించారు. హైదరాబాదులో వైకుంఠధామాలు నిర్మించే కన్సల్టెన్సీ ప్రతినిధులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. దానిని తిలకించిన అనంతరం ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వైకుంఠధామాలకు నిధులు విడుదల చేయాలని కలెక్టర్‌కు ఫోన్‌ద్వారా ఆదేశించారు. వైకుంఠధామాలలో అన్నివర్గాలకు సమ ప్రాధాన్యం ఉండాలని, సౌకర్యాలతో పాటు పచ్చదనం, పరిశుభ్రత కల్పించాలని కోరారు.

కల్యాణం వేళ కూల్ కూల్..

- భద్రాద్రిలో నవమి భక్తులకు వేసవి నుంచి ఉపశమనానికి కసరత్తు
- ఫాగ్‌మిస్ట్ వినియోగానికి కలెక్టర్ చర్యలు
- తొలిసారి ప్రయోగాత్మకంగా వాడకం

భద్రాచలం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో సీతారామచంద్రస్వామి వారి కల్యాణం తిలకించడానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివస్తుంటారు. ఇప్పటి నుంచే ఎండల తీవ్రత భద్రాద్రిలో తీవ్రంగా ఉంది. ఈ క్రమంలో ఈసారి ఏప్రిల్ 6న శ్రీరామనవమి నిర్వహించనుండటంతో భారీగా తరలివచ్చే భక్తులకు వేసవి ఉపశమనం కలిగించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. బుధవారం భద్రాచలంలోని మిథిలా స్టేడియంను సందర్శించిన ఆయన ఈ సందర్భంగా భక్తులు ఎండ వేడిమికి గురికాకుండా ఉపశమనం పొందేందుకు ఫాగర్‌మిస్ట్‌ను వినియోగించాలని జిల్లా అధికారులకు సూచించారు. దీంతో అధికార యంత్రాంగం భక్తులకు ఉపశమనం కోసం చర్యలు చేపడుతోంది.

ఉక్కపోతతో ఇబ్బంది

మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపంలో రామయ్య కల్యాణం నిర్వహించనున్నారు. ఇక్కడ స్వామి వారి కల్యాణంను ప్రత్యక్షంగా 32 వేల మంది భక్తులు తిలకించేందుకు అవకాశం ఉంది. ప్రభుత్వ పెద్దలతో పాటు న్యాయాధికారులు, బ్యూరోక్రాట్లతో పాటు ఇతర ప్రముఖులు వస్తుంటారు. ఈ క్రమంలో వీరి కోసం 30 టన్నుల ఏసీ, వంద కూలర్లు, 250 ఫ్యాన్లు వినియోగించడం జరుగుతోంది. గతంలో తాటాకు పందిళ్లు వేయడంతో ఎండ వేడిమి నుంచి ఉపశమనం లభించేది. అయితే ఇటీవల కాలంలో షామియానాలను వేయడంతో ఎండల తీవ్రతకు భక్తులు ఉక్కపోతకు గురవుతున్నారు. ముఖ్యంగా సామాన్య భక్తుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు.



ఫాగ్‌మిస్ట్ ఇలా ఉంటుంది..

ఫాగ్‌మిస్ట్‌తో ఉపశమనం

రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా తొలిసారి ఫాగ్‌మిస్ట్ విధానాన్ని భద్రాచలంలోని శ్రీరామనవమి కల్యాణం సమయంలో అమలు చేసేందుకు జిల్లా కలెక్టరు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఆయన ఇందుకు సంబంధించి చర్యలు చేపట్టారు. డిస్ట్రిక్ట్ హార్టికల్చర్ అండ్ సెరీకల్చర్ ఆఫీసర్(డీహెచ్ఎస్‌వో) కిషోర్‌కు ఇందుకు సంబంధించి దిశ నిర్దేశం చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఫినోలెక్స్ అనే కంపెనీ ప్రతినిధులు భద్రాచలంలోని మిథిలా స్టేడియంను పరిశీలించి ఈసారి నవమికి ఫాగ్‌మిస్ట్ విధానం ద్వారా భక్తులకు ఉపశమనం అందించేందుకు చర్యలు చేపట్టారు. మొత్తంగా లక్ష చదరపు అడుగుల్లో సుమారు రెండున్నర ఎకరాల్లో ఉన్న స్టేడియంలో భక్తులకు ఈ సౌకర్యం అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా రాష్ట్రంలో ప్రయోగత్మకంగా తొలిసారి ఫాగ్‌మిస్ట్‌ను భద్రాచలంలో వినియోగిస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ఫాగ్‌మిస్ట్ అంటే ....

ఫాగ్‌మిస్ట్ అంటే పొగమంచు. వేసవి కాలంలో ఎండ వేడిమి తాళలేక ఉక్కపోతకు గురవుతున్న వారికి పొగమంచుతో ఉపశమనం కలిగిస్తారు. నీటిలభ్యత ప్రదేశం నుంచి పైపులను ఏర్పాటు చేసి ప్రత్యేక పరికరాల ద్వారా పొగమంచు మాదిరిగా వస్తూ వేడిగా ఉన్న వాతావరణంను చల్లబరుస్తుంది. దీంతో ఆ ప్రాంతంలో ఉన్న వారికి పూర్తిస్థాయిలో ఉపశమనం లభిస్తుంది.

కీచక టీచర్

- 9వ తరగతి విద్యార్థినిపట్ల అసభ్య ప్రవర్తన
- దేహశుద్ధి చేసిన బంధువులు



టీచర్‌కు దేహశుద్ధి చేస్తున్న దృశ్యం

టేకులపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పిల్లలను కంటి రెప్పలా కాపాడాల్సిన ఉపాధ్యాయుడు.. కామాంధుడయ్యాడు. విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించి తన వృత్తికే మచ్చ తెచ్చాడు. దీంతో బంధువులు, గ్రామస్థులు సదరు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన మండలంలోని గంగారం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగింది. పాఠశాల డిప్యూటీ వార్డెన్, హిందీ బోధించే ఉపాధ్యాయుడు ప్రతాప్ సింగ్ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని 9వ తరగతి చదివే ఓ విద్యార్థిని మంగళవారం సాయంత్రం తన తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో బుధవారం ఆమె తల్లిదండ్రులు, గ్రామస్థులు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుడిని నిలదీశారు. కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆ ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. విద్యార్థిని తల్లి ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.



మండు వేసవిలోనూ నిండు కుండై..

- ప్రజల దాహం తీర్చుతున్న నీటి తోగు 6

టెన్త్ పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు



సీపీ సునీల్‌దత్

ఖమ్మం క్రైం, మార్చి19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కమిషనరేట్ పరిధిలో పదో తరగతి పరీక్షల నేపథ్యంలో అయా పరీక్ష కేంద్రాల వద్ద మార్చి 21నుంచి ఏప్రిల్ 4వరకు సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమల్లో ఉంటుందని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల సందర్భంగా కేంద్రాలకు 200మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదన్నారు. ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు మైక్‌లు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించకూడదని తెలిపారు. పరీక్ష సమయంలో కేంద్రాల పరిసరాలలో ఇంటర్‌నెట్ సెంటర్లు, కాపీయింగ్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని, పరీక్ష సమయంలో ఎలాంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు చర్యల్లో 163 సెక్షన్ అమలుచేస్తున్నట్టు సీపీ తెలిపారు.

స్పీడ్ పోస్టు ద్వారా భద్రాద్రి రామయ్య తలంబ్రాలు

» తపాలా ఎస్పీ వీరభద్రస్వామి



ఖమ్మం మామిళ్లగూడెం, మార్చి19: స్పీడ్‌పోస్టు ద్వారా భద్రాద్రిరామయ్య తలంబ్రాలను ఇంటింటికి పంపిణీ చేయనున్నట్లు తపాలాశాఖ ఎస్పీ వీరభద్రస్వామి బుధవారం తెలిపారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని భద్రాచలంలో సీతారామస్వామి దేవస్థానంలో జరిగే సీతారాముల కల్యాణం తలంబ్రాలను ఇంటి వద్దకే స్పీడ్‌పోస్టు ద్వారా అందించడానికి జిల్లాలో ఏర్పాట్లు చేశామన్నారు. కల్యాణానికి తలంబ్రాలకు రూ.450, ముత్యాల తలంబ్రాలు రూ.150లకు అందించనున్నట్లు చెప్పారు. ఖమ్మం డివిజన్‌లోని అన్ని పోస్టాఫీసుల్లో ప్రజలు ముందస్తుగా బుక్ (నమోదు) చేసుకుంటే నేరుగా ఇంటికే తీసుకొచ్చి అందించనున్నట్లు తెలిపారు.

పెద్దమ్మతల్లి ఆలయ పాలకమండలి ఏర్పాటు

» పంతం నెగ్గించుకున్న మంత్రి పొంగులేటి వర్గం

పాల్వంచ రూరల్, మార్చి19(ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలం కేపీ జగన్నాథపురంలోని ప్రసిద్ధ కనకదుర్గ (పెద్దమ్మతల్లి) దేవస్థానం పాలకమండలి కమిటీ ఏర్పాటు ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. 13 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర దేవాదాయశాఖ నుంచి అధికారికంగా ఉత్తర్వులు జారీచేశారు. కమిటీ నియామకంపై ఇద్దరు మంత్రులకు చెందిన వర్గీయుల మధ్య తీవ్ర పోటీ ఏర్పడిన విషయం విదితమే. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి వర్గీయులు పంతం నెగ్గించుకున్నారని చర్చ సాగుతోంది. కమిటీలో సీపీఐకి చెందిన నలుగురికి అవకాశం దక్కింది. పాలకమండలిలో కందుకూరి రాము, భూక్యా గిరిప్రసాద్, కోరం స్వర్ణలత, బాలినేని నాగేశ్వరరావు, పెండలి రమేష్, సందుపట్ల రమ్య, ధర్మరాజుల నాగేశ్వరరావు, చీకటి కార్తీక్, చౌగాని పాపారావు, చెరుకూరి శేఖర్‌బాబు, దుద్దిరాల సుధాకర్, ఎస్. శ్రీనివాసరావు, అడుసుమల్లి సాయిబాబాకు చోటు దక్కింది. పాలకమండలి ప్రమాణస్వీకారం తర్వాత వారిలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ప్రమణ స్వీకారం తేదీ నిర్ణయించాల్సి ఉంది.

మండు వేసవిలోనూ.. నిండు కుండై..

» ప్రజల దాహం తీర్చుతున్న తోగు » ఏడాది పొడవునా తరగని నీటి ఊట

మణుగూరు టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామంలో గల ఓ తోగు(నీటి చెలిమ) అనేక మంది ప్రజల దాహాన్ని తీరుస్తుంది. మండువేసవి లోనూ గ్రామానికి నీటి ఎద్దడి ఉండదు. తోగ్గూడేనికి ఆనుకుని రథంగుట్ట ఉంది. ఆ గుట్ట దిగువ బాగంలో మద్ది, జిన్నె వృక్షాలు ఉన్నాయి. ఈ రెండు వృక్షాల కింద నుంచి ఏడాది పొడువునా నీటి ఊట వస్తుంటుంది. ఆ గ్రామానికే కాదు చుట్టు పక్కల గ్రామాలకు ఈ తోగు నీరే తాగు నీరుగా ఉపయోగపడుతుంది. ఈ తోగు నీటిని తాగునీరుగా తోగ్గూడెం, కళ్యాణపురం, సంతోష్ నగర్, రైల్వేస్టేషన్ కాలనీ, పీవీ కాలనీ ప్రాంతాలకు చెందిన ప్రజలు సైకిళ్లు, బైక్‌లపై క్యాన్లతో నీటిని తీసుకెళ్తుంటారు. చుట్టుపక్కల గ్రామాల్లో మంచినీటి ఎద్దడి ఏర్పడినా ఈ తోగు నీరే శరణ్యం అవుతుంది. మణుగూరు కొత్తగూడెం ప్రధాన రహదారికి 100 మీటర్ల దూరంలో ఉన్న ఈ తోగు వరకు బీటీ రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ తోగుతోనే ఈ గ్రామానికి తోగ్గూడెం అనే పేరు వచ్చింది.

ప్రతిపాదనలకు ఆదేశాలు

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తోగును అభివృద్ధికి ప్రతిపాదనలకు సిద్ధం చేయాలని ఆదేశించినట్లు ఎఫ్‌డీవో సయ్యద్ మక్సూద్ మోహినుద్దీన్ తెలిపారు. తోగును సోలార్ సిస్టమ్ ద్వారా మోటార్ ఏర్పాటు చేసి గ్రామప్రజలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. తోగు చుట్టూ ఫెన్సింగ్, చెట్లు నాటి, పంపింగ్ కోసం పైపుల ఏర్పాటుకు రూ.10లక్షలు అవుతాయని తెలిపారు.



నీటిని క్యాన్లలో నింపుకొంటున్న తోగ్గూడెం గ్రామస్థులు



తాతలతండ్రుల నుంచే ఈ నీరే...

కాకా రాములు, తోగ్గుడెం

తాతలతండ్రుల నుంచి తోగ్గూడెం గ్రామంలోని తోగు నీరే తాగుతున్నాం. ఈ నీటిని తాగడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావు. అందరం ఆరోగ్యంగా ఉంటున్నాం. తోగు వరకు మంచి రోడ్డు సౌకర్యాన్ని కల్పిస్తే గ్రామస్థులకు ఇతరలకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. పైపులైను వేసి నీటిని సరఫరా చేయాలి.

మంచి ఔషధ గుణాలు ఉన్నాయి.

పర్సిక ఏడుకొండలు, మిట్టగూడెం



మాది మణుగూరు మండలం తోగ్గూడెం గ్రామం. దాదాపు 5 కిలోమీటర్ల దూరం నుంచి ఇక్కడికి వచ్చి ఈ తోగు నీటిని తీసుకెళ్తున్నా. కుటుంబం మొత్తం ఈ నీరే తాగేందుకు వాడుతాం. మంచి ఔషధ గుణాలు ఉన్న నీరు వల్ల ఎలాంటి సమస్యలు తలెత్తవు. 20 ఏళ్లుగా ఈ నీరే తాగుతున్నాం.. ఎంతో మంచి నీరుగా తోగు నీరు ప్రసిద్ధి కెక్కింది.



గాదె నవ్య

ఆదర్శం.. ఆ గృహిణి

» రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక

తల్లాడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యాన్ని ఆ వివాహిత అధిగమించింది. రెండురోజుల వ్యవధిలో రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై ప్రతిభను చాటింది. పది సంవత్సరాల క్రితం వివాహమైనప్పటికీ గృహిణిగా ఒకవైపు కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూ మరోవైపు ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యాన్ని చేరుకుంది. తల్లాడ మండలం మంగాపురం గ్రామానికి చెందిన గాదె నవ్య బుధవారం విడుదలైన స్త్రీశిశుసంక్షేమశాఖ గ్రేడ్-1 సూపర్‌వైజర్ ఉద్యోగానికి ఎంపికైంది. సోమవారం రాత్రి విడుదలైన మహిళా అభివృద్ధి శిశుసంక్షేమశాఖలో సూపరింటెండెంట్ ఉద్యోగాన్ని కూడా సాధించింది. గ్రేడ్-1 సూపర్‌వైజర్ ఉద్యోగానికి 300మార్కులకు గానూ 205.12 మార్కులను సాధించి రాష్ట్రస్థాయిలో 89వ ర్యాంకు, జోన్‌లో 9వ ర్యాంకు పొందింది. నవ్య 1నుంచి 10వతరగతి వరకు తల్లాడలోని సాయిచైతన్య స్కూల్, ఇంటర్ తల్లాడలోని కేఎస్‌ఎం కళాశాలలో, డిగ్రీ ఖమ్మం, బీఈడీ మధిరలో, దూర విద్య ద్వారా ఎంఏ సోషియాలజీ పూర్తిచేసింది. 2015లో అదే గ్రామానికి చెందిన పర్సారి రమేష్‌తో వివాహమైంది. భర్త రమేష్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చలువ పందిళ్లు, తాగునీరు ఏర్పాటు చేయాలి

» భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్

» శ్రీరామనవమి ఏర్పాట్ల పరిశీలన

భద్రాచలం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో శ్రీరామనవమి సందర్భంగా భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని చలువ పందిళ్లు, తాగునీటితో పాటు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కోరారు. బుధవారం భద్రాచలంలో కల్యాణం జరిగే మిథిలా స్టేడియంలో పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారి కల్యాణం, పట్టాభిషేకం తిలకించడానికి వచ్చే భక్తులకు ప్రత్యేకంగా పాలీహౌజ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గోదావరి కరకట్ట పక్కన క్యాంప్ సైడ్‌హౌజ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దేవస్థానానికి సంబంధించిన అన్ని పనులు పూర్తయ్యాయని, కల్యాణ మండపంలో జరగవలసిన ఏర్పాట్లను ప్రత్యేక అధికారులను నియమించామని తెలిపారు. కల్యాణ మండపానికి వెళ్లే మార్గంలో భక్తులకు తెలిసేలా ఫ్లెక్సీలు, రూట్‌మ్యాప్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దామోదర్ రావు, దేవస్థానం ఈవో రమాదేవి, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మిథిలా స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

నవమి ఏర్పాట్లపై ఆరా

భద్రాద్రి రామాలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కలెక్టర్ జితేష్ వి. పాటిల్ భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, వైదిక సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈసారి నవమి నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలు, వైదికపరంగా తీసుకోవలసిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా భద్రాద్రి దేవస్థానం నూతనంగా రూపొందించిన భద్రాచలం టెంపుల్ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి కలెక్టర్ డౌన్‌లోడు చేసుకున్నారు.

మామిడిపై 'వెదర్ ఎఫెక్ట్'

» పగలు పెరుగుతున్న ఉష్ణోగ్రత, రాత్రి తగ్గని మంచు

ఖమ్మం వ్యవసాయం/ అశ్వారావుపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గత ఏడాది పూత, దిగుబడులు లేక ఇబ్బందులు పడ్డ మామిడి, జీడి మామిడి రైతులకు ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు, మంచురూపంలో మరోసారి భారీ నష్టాన్ని తెస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మామిడి, జీడిమామిడి తోటలు బాగా పూశాయి. రైతులు ఎరువులు, ఇతర యాజమాన్య పద్ధతులకు భారీగానే పెట్టుబడులు పెట్టారు. ఆ ఆనందం మరువకముందే మామిడి, జీడిమామిడి తోటలకు మంచు రూపంలో పెద్ద విపత్తు వచ్చిపడింది. ఇప్పటికీ భిన్నమైన వాతావరణం ఉండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. తెల్లవారు నుంచి ఉదయం 8గంటల వరకు మంచు విపరీతంగా కురుస్తుంది. దీంతో పురుగు ఉధృతి పెరుగిపోతుంది. పూత, పిందె కళ్ల ఎదుటే మాడిపోతుంది. రాలి పోతుంది. దీంతో నియోజకవర్గంలో దాదాపు 15 వేల ఎకరాలకుపైగ ఉన్న మామిడి, 30 వేల ఎకరాలకుపైగ ఉన్న జీడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

వేసవి ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కలిగించడానికి ప్రతీ మొక్కకు 6 నుంచి 8 డ్రిప్పర్లతో రోజుకు 3 గంటలు చొప్పున నీరు పెట్టాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎంవీ మధుసూదన్ బుధవారం తెలిపారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున, నేలలో తేమ సమతుల్యతను కాపాడుకోవడానికి ఉదయం గంటన్నర, సాయంత్రం గంటన్నర నీరు పెట్టవచ్చన్నారు. పండ్ల పెరుగుదలను వేగవంతం చేయడానికి 10 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న చెట్లకు 500 గ్రాముల యూరియా, 500 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలన్నారు. రసం పీల్చే చీడపీడలను గమనించినట్లయితే లీటరు నీటికి ఫిప్రోనిల్ 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలన్నారు.



మామిడి తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి మధుసూదన్

బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు మిశ్రమ స్పందన లభించింది. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. కొందరు నాయకులు బడ్జెట్‌ను స్వాగతించగా, మరికొందరు ఆక్షేపణ వ్యక్తం చేశారు. హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అభయ హస్తం హామీలు బుట్టదాఖలు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం

నల్లమల వెంకటేశ్వర రావు, సంయుక్త కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గసభ్యుడు

బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి 15శాతం నిధులు కేటాయించడం హర్షనీయం. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపపడతామని ఇచ్చిన హామీ రైతులకు మేలు చేస్తుంది. ఉమ్మడి జిల్లాలో సీతారామ ప్రాజెక్టుతో పాటు మిగిలిన ప్రాజెక్టులకు నిధులు కేటాయించిన ప్రభుత్వానికి జిల్లా రైతుల తరుపున కృతజ్ఞతలు.. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించి ఉంటే బాగుండేది.

ప్రజారంజక బడ్జెట్

మాలోతు రాందాస్‌నాయక్, వైరా ఎమ్మెల్యే



ప్రజాపాలనలో సంక్షేమమే ధ్యేయంగా ప్రజారంజక బడ్జెట్ రూపకల్పన జరిగింది. అన్నిరంగాల శ్రేయస్సే పరమావధిగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. యువతకు స్వయం ఉపాధి కల్పించేలా రాజీవ్ యువవికాసం, సాగునీరు, మునిసిపల్, వ్యవసాయం, విద్యా, వైద్యం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారు.

ముగ్గురు మంత్రులున్నా జిల్లాకు అన్యాయం

నున్నా నాగేశ్వరరావు, సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి

జిల్లానుంచి డిప్యూటీ సీఎంతో పాటు ఇద్దరు మంత్రులు ఉన్నా బడ్జెట్‌లో ఖమ్మం జిల్లాకు నిధులు కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగింది. సీతారామకు కేవలం రూ.699కోట్లు కేటాయించారు. బడ్జెట్‌ను సవరించి ఈ ప్రాజెక్టుకు కనీసం రూ.8వేల కోట్లు కేటాయించాలి. ఖమ్మానికి జనరల్ యూనివర్శిటీ ఊసే లేదు. బడ్జెట్‌కు ఆదాయ మార్గం చూపలేదు.

అధిక నిధులివ్వడం అభినందనీయం

సాబీర్‌పాషా, సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి



ప్రజాప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు రూ.56కోట్లు కేటాయించడం అభినందనీయం. ఎసీ, ఎస్టీల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. అన్నిరంగాలకు కేటాయించిన నిధులను ఖర్చు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. విద్య, వ్యవసాయరంగాన్ని నిరాశకు గురి చేసింది. అప్పుల్లో చిక్కుకున్న రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పయనింపజేసేందుకు కృషి చేయాలి.

చేతులెత్తేసిన ప్రభుత్వం

రేగా కాంతారావు, భద్రాద్రి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు



ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేసే పరిస్థితి లేదని బడ్జెట్‌లో స్పష్టమైంది. మాటలకు, చేతలకు పొంతన లేకుండా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రజలను మభ్యపెట్టేలా, ప్రభుత్వ అసమర్థను చాటుకునేలా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ఇచ్చిన హామీలకు నిధుల కేటాయింపునకు పొంతన లేదు.

ఊహాజనకంగా రాష్ట్ర బడ్జెట్

మచ్చ వెంకటేశ్వర్లు, భద్రాద్రి జిల్లా సీపీఎం కార్యదర్శి



వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా ఊహాజనకంగా రాష్ట్ర బడ్జెట్ ఉంది. ఆరు గ్యారెంటీల అమలుపై బడ్జెట్‌లో స్పష్టమైన ప్రతిపాదన లేదు. సంక్షేమ రంగానికి నిధుల కేటాయింపులో కోత విధించారు. గ్రామీణ ప్రాం త రైతులు, వ్యవసాయ కూలీల సంక్షేమంపై స్పష్టత లేదు. మధ్య తరగతి ప్రజలను నిరాశకు గురి చేసింది. ఉన్నతవర్గాల ప్రయోజనానికే బడ్జెట్‌లో పెద్దపీట వేశారు.

అభయహస్తం హామీలు బుట్టదాఖలు..

అమరనేని రామారావు, టీఎన్‌జీవోస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు

అభయహస్తం మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. కేవలం 1వ తేదీన వేతనాలు ఇవ్వడం మినహా మిగిలిన అంశాలపై స్పష్టత కరువైంది. పదవి విరమణ పొందిన ఉద్యోగులకు బెనిఫిట్స్ పొందాలంటే న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఉండటం దురదృష్టకరం. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ఉద్యోగుల డీఏ, పీఆర్‌సీ, ఆరోగ్యకార్డులకు ఒక్కపైసా కేటాయించకపోవడం బాధకరం. బడ్జెట్‌లో ఉచితాలకు ఇచ్చిన ప్రాధాన్యత ఉద్యోగుల సమస్యలకు ఇవ్వలేదు.

అన్ని వర్గాలకు ఆర్థిక న్యాయం..

పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు

అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజారంజకంగా ఉంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కాంగ్రెస్ ప్రభుత్వం పునరుజ్జీవం పోసింది. సామాజిక, ఆర్థిక అంశాలను పరిగణలోకి తీసుకొని అన్ని వర్గాలకు కేటాయింపులు చేశారు. అభివృద్ధి, సంక్షేమానికి ఇబ్బంది లేకుండా భవిష్యత్ ఆర్థిక కార్యాచరణ చేశారు.

అన్ని వర్గాలను మోసం చేసేలా బడ్జెట్

వనమా వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి



అన్ని వర్గాల ప్రజలను మోసం చేసేలా రాష్ట్ర బడ్జెట్ ఉంది. ఢిల్లీకి మూటలు పంపేలా బడ్జెట్‌గా ఉంది. పూర్తిగా అంకెల గారడీ ప్రదర్శించారు. ఈ బడ్జెట్‌తో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ పేక మేడలా కుప్ప కూలుతుంది. ఇది పూర్తి అసమర్థ బడ్జెట్..

విద్యా రంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు

విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బడ్జెట్ కేటాయింపుల ద్వారా నిరూపితమైంది. కేవలం 7.57శాతం నిధులు కేటాయించారు. ఎన్నికల హామీలో 15శాతం నిధులు కేటాయిస్తామని ప్రకటించినా అది అమలు చేయటం లేదు. పెండింగ్ స్కాలర్ షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్ ప్రస్తావనే లేదు. కనీసం 30శాతం నిధులు కేటాయిస్తే ప్రభుత్వ విద్యా వ్యవస్థకు జీవం పోసినట్లుండేది.

హామీల అమలుకు అధిక నిధులు

ఊకంటి గోపాలరావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు



ప్రజాప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించారు. పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేశారు. ఆరు గ్యారెంటీల అమలుతో పాటు కొత్త పథకాలను ప్రవేశపెట్టి వాటికి సైతం నిధులు కేటాయించి పేదరిక నిర్మూలనకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు.

మైనార్టీల అభివృద్ధికి కృషి: పొంగులేటి

ఖమ్మం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మైనారిటీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషిచేస్తుందని రాష్ట్ర రెవెన్యూ హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మంత్రి ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని టీసీవీ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలందరి దీవెనలతో రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిందని అన్నారు. మైనారిటీ సోదరుల కోరికలను నెరవేర్చే దిశగా ఇందిరమ్మ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు. దేశంలో ప్రజలందరూ సమానంగా ఉండాలని తమ ప్రభుత్వం, పార్టీ ఉద్దేశ్యమని తెలిపారు. యువతకు స్వయం ఉపాధి కల్పించే దిశగా మరో అద్భుతమైన పథకాన్ని రూపొందించటం జరిగిందని, రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా 50వేల నుంచి 5 లక్షల రూపాయల వరకు ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 5వేల మందికి తగ్గకుండా ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు అర్హులను ఎంపికచేసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీచేస్తామని అన్నారు. పాలేరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న అన్ని మసీదులలో త్రాగునీరు, విద్యుత్, పారిశుధ్యం ఏర్పాట్లుచేసే విధంగా జిల్లా యంత్రాంగం కృషిచేస్తుందని, ప్రతీ మసీదుకు లక్ష రూపాయల చొప్పున పండుగలోపు నిధులు విడుదల చేస్తామని మంత్రి అన్నారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలో మైనారిటీ సోదరులకు ఉపయోగపడే విధంగా షాదీఖానా నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఎంపికచేయాలని మంత్రి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో హిందూ ముస్లింలు గంగా జమున తహజీబ్ లాగా ఎల్లప్పుడూ కలిసి ఉండాలని అన్నారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రతీ మసీదులో విద్యుత్ సరఫరా, త్రాగునీటి సరఫరా, పారిశుద్య నిర్వహణ, పోలీస్ భద్రత వంటి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులందరికీ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డాక్టర్ బి.పురంధర్, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, ఏదులాపురం మునిసిపాలిటి కమిషనర్ ఏ.శ్రీనివాసరెడ్డి, ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీవో కుమార్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పండు తినిపిస్తున్న మంత్రి పొంగులేటి

ఉందిలే మంచికాలం..

(5వ పేజీ తరువాయి)

పర్యాటక అభివృద్ధిపై ఆశలు..

బడ్జెట్‌లో పర్యాటక రంగానికి రూ.775కోట్లు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.80కోట్ల పనులకు పరిపాలనా పరమైన మంజూరు ఉంది. కానీ ఆర్థికశాఖ క్లియరెన్స్ లభించలేదు. తాజా బడ్జెట్ కేటాయింపుల్లో ఉమ్మడి జిల్లాకు కనీసం రూ.100కోట్లయినా వస్తాయని ఆశిస్తున్నారు. తద్వారా జిల్లాలో పర్యాటక అభివృద్ధి పనులకు మోక్షం లభించే అవకాశం ఉంది.

ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు..

బడ్జెట్‌లో విద్యాభివృద్ధి కింద ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు ప్రభుత్వం నిధులు కేటాయించింది. రూ.11,600కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మించనున్నారు. జిల్లాలో ఖమ్మం, పాలేరు, మధిర నియోజవర్గాలకు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ మంజూరైన విషయం తెలిసిందే. బడ్జెట్‌లో వీటికి నిధులు కేటాయించడంతో ఇక పనులు వేగవంతం కానున్నాయి. మహిళ స్వయం సహాయకసంఘాలకు ఇందిర మహిళా శక్తి మిషన్ ద్వారా రుణాలు ఇవ్వనున్నారు. ఇందుకోసం రూ.21,632కోట్లు కేటయించారు. ఈ పథకంతో ఇరు జిల్లాల్లో మహిళలు వ్యాపార రంగంలో రాణించే అవకాశం ఉంది. ఇప్పటికే ఇందిర డైరీ పేరుతో మధిరలో పాల ఉత్పత్తి కార్యక్రమానికి చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్వయంసహాయక సంఘాలకు జిల్లాలో ఆర్టీసీ బస్సులు కూడా కేటాయించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను కూడా స్వయం సహాయక సంఘాలకు ఏర్పాటు కానున్నాయి.

'విద్యుత్' అంబులెన్స్ సర్వీసులు

విద్యుత్ సంబంధిత సమస్యలపై హైదరాబాదులో నిర్వహిస్తున్న 'విద్యుత్' అంబులెన్స్ సేవలు ఇప్పుడు జిల్లాలకు కూడా విస్తరించ బోతున్నారు. ఇందుకోసం 1912 టోల్‌ఫ్రీనెంబర్‌ను ఏర్పాటుచేసి విద్యుత్ స మస్యలపై ఫోన్‌చేస్తే వెంటనే అంబులెన్స్ ద్వారా ఏఈ, సిబ్బంది బాధితుల ఇంటికి వెళ్లి సమస్యను పరిష్కరిస్తారు. రోజులో 24గంటలు ఈ సేవలు అందుబాటులో ఉంటారు. ఈ అంబులెన్స్‌లో ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎప్పుడూ సిద్ధంగా ఉంచుతారు. హైదరాబాదులో 57సబ్‌స్టేషన్ల పరిధిలో ప్రస్తుతం ఈ పథకం అమల్లో ఉంది. ఇప్పుడు ఈ పథకం జిల్లాలోని మండలాలకు రాబోతోంది.

టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా రాయండి: కలెక్టర్

కొణిజర్ల, మార్చి19(ఆంధ్రజ్యోతి): ఆందోళన చెందకుండా భయం వీడి పదో తరగతి పరీక్షలను ప్రశాంతంగా రాయాలని విద్యార్థులకు జిల్లా కలెక్ట ర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. పదో తరగతి వి ద్యార్థులతో ముచ్చటిస్తూ విద్యార్థులకు పరీక్షలను సులువుగా రాసేందుకు అవగాహన కల్పించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు విద్యార్థులంతా ప్రణాళికను సిద్ధంగా చేసుకొని చదవాలని, పరీక్షలకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. పరీక్షలంటే భయపడొద్దని, అలా భయపడటం వలన పరీక్షహాల్‌కు వెళ్లిన తర్వాత చదివింది కూడా మరిచిపోతామని అన్నారు. చదువుతో పా టు ప్రతి రోజు విద్యార్థులు నాణ్యమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాలలో 'వుయ్ కెన్ లెర్న్'పై విద్యార్థులతో మాట్లాడా రు. విద్యార్థుల మధ్య కూర్చొని వారు మాట్లాడే విధానాన్ని విన్నారు. విద్యార్థులంతా ఆంగ్లంపై కూడ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఎంపీడీవో రోజారాణి, తహసీల్దార్ రాము తదితరులు పాల్గొన్నారు.

మట్టి కుండలకు గిరాకీ

- ఫ్రిడ్జ్ నీళ్లకంటే కుండలో నీరే శ్రేయష్కరం
- జ్యూస్‌లు, కూల్‌డ్రింక్స్ కంటే నీరే ఆరోగ్యానికి మేలు
- డీ హైడ్రేట్ అవకుండా, రోగ నిరోధక శక్తి కూడా
- రూ.70నుంచి రూ.300వరకు లభ్యం

సత్తుపల్లిరూరల్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు సూర్యుడి ప్రతాపం చూపిస్తున్నాడు. ఇన్నిరోజుల పాటు ఉదయం 10గంటలకే ఎండవేడిమి ఎక్కువై ఉక్కపోతకు ప్రజలు అల్లాడిపోగా సాయంత్రం అయ్యేసరికి చలికాలాన్ని తలపించింది. కానీ రెండుమూడు రోజుల నుంచి భానుడి ప్రతాపం కనిపిస్తోంది. బయటకు రావాలంటే ఎండలకు భయపడిపోతున్నారు ప్రజలు. పైగా సింగరేణి ఓసీలకు దగ్గరగా ఉన్న వారి పరిస్థితి మరింత దారుణమైంది. దీంతో దాహార్తిని తీర్చుకునేందుకు ప్రజలు జ్యూస్ స్టాల్స్, కూల్‌డ్రింక్స్ మీద ఆధారపడుతున్నారు. అయితే వీటిని తీసుకోవడం వలన బాడీ డీ హైడ్రేట్ అయి అనారోగ్య సమస్యల బారినపడే ప్రమాదం ఉందని, ఎండాకాలం కావడంతో ప్రాణాల మీదకు వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో మట్టిపాత్రలలో నిల్వ ఉంచిన నీరే అత్యంత శ్రేయష్కరమని చెబుతున్నారు. దీంతో మట్టి కుండలకు గిరాకీ పెరిగింది.

విజయవాడ నుంచి దిగుమతి

సత్తుపల్లి చుట్టుపక్కల ఎక్కడా మట్టి పాత్రల తయారీ కేంద్రాలు లేకపోవడంతో ఆంధ్రాలోని విజయవాడ నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. ఇక్కడే తయారీ ఉన్నట్లయితే తక్కువ ధరలకే విక్రయించే అవకాశం ఉందంటున్నారు. రూ.70నుంచి మొదలు రూ.300వరకు తమవద్ద మట్టిపాత్రలు లభ్యమవుతున్నాయని, చల్లని సహజసిద్ధమైన నీటికోసం కుండలే శ్రేయష్కరమని వ్యాపారస్థులు అంటున్నారు. అయితే గతేడాది కంటే ఈ ఏడాది ఇంకా విక్రయాలు జోరందుకోలేదని, ఉగాది నాటికి ఎండలు ముదిరితేగానీ కుండల కోసం ఆసక్తి చూపరని అంటున్నారు.


అమ్మకానికి సిద్ధంగా ఉన్న కుండలు

డీ హైడ్రేట్ అవకుండా..

మట్టిలో ఎన్నో మినరల్స్, సాల్ట్ ఉంటాయి. అలాగే అందులో ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ ఎనర్జీ దాగుంటుంది. ఇలాంటి మట్టితో తయారుచేసి కుండలో నీటిని నిల్వ చేయడం వల్ల ఈ గుణాలన్నీ ఆ నీటిలోకి చేరతాయి. ఈ నీటిని తాగడం వల్ల వేసవిలో మనం కోల్పోయిన శక్తిని తిరిగి పొందుతాం. వేసవిలో ఎక్కువగా ఇబ్బంది పెట్టేది డీ హైడ్రేషన్ సమస్య. మట్టి కుండలో నీరు తాగితే శరీరం డీ హైడ్రేట్ కాకుండా జాగ్రత్తపడొచ్చు. అదేవిధంగా ఇమ్యూనిటీ పెరుగుతుంది... బాడీ ఎనర్జిటిక్‌గా ఉంటుంది. రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. జలుబు, దగ్గు, ఆస్తమాతో బాధపడే వాళ్లు కుండనీళ్లు వాడటం బెస్ట్ అంటున్నారు వైద్యనిపుణులు. కుండలో నీటిని తాగడం వల్ల అనేక ప్రయోజనాలు దాగి ఉంటాయన్న నమ్మకంతో ప్రజలు ఈ నీటిని ఆశ్రయిస్తున్నారు.

జీవిత అనుభవాల్ని తెలిపేది కథ


మాట్లాడుతున్న రవీందర్

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కథ అంటే జీవిత అనుభవాల్ని తెలిపేది అని ప్రముఖ కథకుడు, కవి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ అన్నారు. బుధవారం నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం -ఐ.క్యూ.ఏ.సి విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా అధ్యక్షతన కథలోకి...కథ వర్క్ షాప్ -2 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కథ ఎలా రాయాలి - నా కథా నేపథ్యం అనే అంశంపై విద్యార్థులకు తన స్వీయ కథల రచనల నేపథ్యాన్ని, రచనానుభవాన్ని వివరించారు. ప్రముఖ కథా రచయిత నల్లగొండ, నాగార్జున ప్రభుత్వ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డా.వెల్దండి శ్రీధర్ "కథలు చదవడం ఎలా?- కథావిమర్శ అనే అంశంపై మాట్లాడుతూ సాటి మానవుడ్ని అర్థం చేసుకోవాలంటే కథలు బాగా చదవాలని కోరారు. ప్రతి రోజు ఒక కథ చదవాలని సూచించారు. సాహిత్యమే మనుషుల్ని పరిపూర్ణుల్ని చేస్తుందన్నారు. చివరగా విద్యార్థులు రాసిన కథల్ని విశ్లేషించారు. కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డా.పి.రవికుమార్, ఐ.క్యూ.ఏ.సి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద, కాళోజీ అవార్డు గ్రహీత డా.సీతారాం, కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహాదారులు కవి, ప్రసేన్, విద్యావేత్త రవిమారుత్, వైస్ ప్రిన్సిపాల్స్ ఏ.ఎల్.ఎన్.శాస్త్రి, డా.బానోత్ రెడ్డి, తెలుగు విభాగం అధ్యాపకులు డా.జె.అనురాధ, డా.కిరణ్, కోటమ్మ, ఎంవీ రమణ, కార్తీక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

డైరెక్టర్ ఆఫ్ ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు కృష్ణారావు

కొత్తగూడెం అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్షకు 5 నిమిషాలు నిబంధనలు వర్తిస్తాయని డైరెక్టర్ ఆఫ్ ప్రభుత్వ పరీక్షల సంచాలకులు కృష్ణారావు అన్నారు. బుధవారం పది పరీక్షల నిర్వహణపై అన్నిజిల్లాల డీఈవోలు, ఏసీజీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పది పరీక్ష పత్రాలపై క్యూఆర్ కోడ్, సీరియల్ నెంబర్ ఉంటుందని, పోలీస్ స్టేషన్ల నుంచి పరీక్ష కేంద్రాలకు, కేంద్రాల నుంచి పోస్టాఫీసుకు ఎస్కార్ట్ సహకారంతో చేరవేయాలన్నారు. పరీక్ష ముగిసిన తరువాత మాత్రమే విద్యార్థుల అటెండెన్స్ తీసుకోవాలని, పరీక్షల టైం టేబుల్, నిబంధనలను తప్పకుండా పాటించాలని, కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, పరీక్ష విధుల్లో లేనివారికి అనుమతి నిరాకరణతో పాటు ప్రతి జిల్లాకు అబ్జర్వర్ ఏర్పాటు చేశామన్నారు. గతంలో డీఈవోగా పనిచేసి ప్రస్తుతం విద్యాశాఖ ఉన్నతాధికారిగా విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మి బాయిని అబ్జర్వర్‌గా నియమించామని అన్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు 144సెక్షన్ అమలు జరుగుతుందని అన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

అశ్వారావుపేట రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వినాయకపురం నుంచి బోలేరో వాహనంలో 5 క్వింటాళ్ల బియ్యాన్ని ఆంధ్రాలోని జంగారెడ్డిగూడెం వైపునకు అక్రమంగా తరలిస్తున్నారు. సమాచారం మేరకు అశ్వారావుపేట బస్టాండ్ సమీపంలో వాహనాన్ని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్ దారం చిన శ్రీనివాస్, వాహన యజమాని ఆదివిష్ణుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టుకున్న బియ్యాన్ని పౌర సరఫరాశాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

ధ్రువ పత్రాలు సకాలంలో అందించాలి: పీవో

బూర్గంపాడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల సవరణ జాబితా, గిరిజన విద్యార్థులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో జాప్యం లేకుండా సకాలంలో అందించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్ అన్నారు. బుధవారం బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల సవరణ జాబితా ప్రక్రియను ఆయన పరిశీలించి ఓటర్ సవరణ జాబితా రివిజన్ ఏవిధంగా జరుగుతుందని తహసీల్దార్ ముజాహిద్‌ను అడిగి తెలుసుకున్నారు. పీవో మాట్లాడుతూ 18సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు ఫామ్-6 ద్వారా నూతనంగా ఓటు హక్కు రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలని అన్నారు. ఓటర్లునూతన ఓటు హక్కు రిజిస్ట్రేషన్ మార్పులు చేర్పులు తదితర సేవలకు ఎక్కడ తిరిగే అవసరం లేకుండా బీఎల్‌వో యాప్ ద్వారా అన్ని సేవలు చేసుకోవచ్చని ఓటర్లకు సిబ్బంది తెలియజేయాలని అన్నారు. అలాగే నిరుద్యోగ యువకులకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టినందున తప్పనిసరిగా సర్టిఫికెట్లు అవసరం ఉంటుందని ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే జాప్యం చేయకుండా సకాలంలో అందించాలని అన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణా జరగకుండా తమ సిబ్బందిని ఇసుక ర్యాంపుల వద్ద 24గంటలు కాపలా ఉంచుతున్నామన్నారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఎదగాలి

- కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్
- విద్యాశాఖ ఆధ్వర్యంలో సహాయ ఉపకరణాల పంపిణీ

కొత్తగూడెం అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్ కోసం ఆత్మస్థైర్యంతో ఎదగాలని జిల్లా కలెక్టర్ జితేష్ విపాటిల్ అన్నారు. బుధవారం జడ్పీహెచ్ఎస్ ఆనందఖని కొత్తగూడెంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు ధృడ సంకల్పంతో ఎదిగి భవిష్యత్‌ను బంగారుమయం చేసుకోవాలన్నారు. మానస జోషి గురించి ప్రస్తావిస్తూ.. యాక్సిడెంట్‌లో కాళ్లు కోల్పోయినప్పటికీ సంకల్పంతో పారా ఒలంపిక్ క్రీడల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించారని అన్నారు. ప్రభుత్వాలు కల్పించే సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులకు సహాయ ఉపకరణాలు అందజేసి వారి తల్లిదండ్రులతో మాట్లాడి అధైర్య పడవద్దని, విద్యార్థుల భవిష్యత్‌కోసం అన్ని వేళలా సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. డీఈవో వెంకటేశ్వరచారి మాట్లాడుతూ.. దివ్యాంగ విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనీనా, విద్యాశాఖ ఏఎంవోలు సైదులు, నాగరాజ శేఖర్, హెచ్ఎం మంగిలాల్, భవిత కేంద్రాల ఉపాధ్యాయులు, అలింకో సంస్థ ప్రతినిధులు సురుష, మోహిత్, ఐఈఆర్‌పీలు, దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.


దివ్యాంగులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

బాలల సదనం ఆధునికీకరణ పనులు పూర్తిచేయాలి

- పిల్లలకు సొంత ఇంట్లో ఉన్నామనే భావన కలగాలి
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం ఖానాపురంహవేలి,మార్చి 19(ఆంధ్రజ్యోతి): మన పిల్లలకు సొంత ఇంటిని ఆధునీకరణ చేస్తున్నామనే మంచి మనస్సుతో అధికారులు నాణ్యతతో పనులు పూర్తి చేసి బాలల సదనం సుందరీకరణ పూర్తి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం కలెక్టర్, నగరంలోని బాల సదనం భవనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాల సదనంలో చేపట్టాల్సిన మరమ్మతు పనులు, పిల్లలకు ఆహ్లాదం కోసం కల్పించాల్సిన ఆట పరికరాలు, గ్రీనరీ, వాల్ పెయింట్, అదనపు వసతుల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, బాలల సదనంలోని స్థలంలో ఉన్న పగిలిన బండలను తొలగించి భూమి చదును చేయాలని, అక్కడ పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే దిశగా ఉయ్యాల, జారుడు బండ, సీసా గేమ్స్, షటిల్ కోర్ట్ వంటి వివిధ ఆటలు ఆడుకునే సౌకర్యాలు ఏర్పాటు చేస్తూ మంచి ప్లే ఏరియా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బాలల సదనంలో మొక్కలను నాటి గ్రీనరీ పెంపొందించాలని, ఉన్న పెద్ద చెట్లను అలాగే వుంచి వాటితో మంచి నీడ ఉన్నందున చిన్న, చిన్న ఓపెన్ జిమ్ పరికరాలను ఏర్పాటు చేయాలని అన్నారు. బాల సదనం భవనంలో అవసరమైన మరమ్మతు పనులు చేపట్టాలని, మెదటి అంతస్తు మెట్లకు ఇరువైపులా పటిష్టమైన రైడింగ్‌లను ఏర్పాటు చేయాలని అన్నారు. భవనం రూమ్‌లలో గోడలపై ఆకర్షణీయమైన వాల్ పెయింటింగ్స్, పిల్లలకు సంతోషం కలిగించే బొమ్మలతో చిత్రాలు ఉండే విధంగా రూపొందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

అనంతరం కలెక్టర్, రఘునాదం పాలెంలో నూతనంగా నిర్మించే బాలల రక్షణ భవనం, ఓల్డ్ ఏజ్ హోం భవనాలకు అనువైన స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, మునిసిపల్ ఈఈ కృష్ణలాల్, జిల్లా బాలల సంరక్షణ అధికారి విష్ణు వందన, రఘునాధపాలెం మండల తహసీల్దార్ జి.విలసన్, బాల సదనం సూపరింటెండెంట్ వరలక్ష్మి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు మంత్రులు జిల్లాకు ఏం చేశారు..?

కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

భద్రాచలం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు ముగ్గురు మంత్రులున్నా గత ఏడాది కాలంగా అభివృద్ధికి ఏం నిధులు తెచ్చారని జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. భద్రాచలంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు నిధులు తీసుకురాకపోగా అవినీతికి పరాకాష్టగా మిగిలారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడాన్ని ఈ సందర్భంగా ఆయన ఉదహరించారు. కాంగ్రెస్ పార్టీ ఓటమి చెందగా బీఆర్ఎస్‌కు కనీసం బరిలో నిలిచేందుకు అభ్యర్థులు సైతం కరువయ్యారని అన్నారు. ఈ రెండు పార్టీలతో ప్రజలు విసిగిపోయారని బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని గుర్తిస్తున్నారని అన్నారు. బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన ప్రభాకర్‌రెడ్డి తొలిసారిగా భద్రాద్రి రాకను పురస్కరించుకొని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంజా ధర్మా, ములిశెట్టి రామ్మోహన్‌రావు, కుంజా సంతోష్, త్రినాథరావు, రఘురాం, బిట్రగుంట్ల క్రాంతికుమార్, ముత్యాల శ్రీనివాసరావు, నిడదవోలు నాగబాబు, ముక్కెర కోటేశ్వరి పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

మాజీ సర్పంచ్ హరిబాబు గుండెపోటుతో మృతి

కల్లూరు, మార్చి19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముచ్చవరం గ్రామ మాజీ సర్పంచు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వైకంఠి హరిబాబు (62) బుధవారం ఉదయం తన నివాస గృహంలో గుండెపోటుతో ఆకస్మాత్తుగా మృతి చెందారు. ముచ్చవరం గ్రామ పంచాయతీ సర్పంచుగా రెండు పర్యాయాలు సేవలు అందించారు. ఆ కుటుంబం నుంచే హరిబాబు సతీమణి పద్మ కూడ ఎంపీటీసీగా సేవలందించారు. గత ముప్పై సంవత్సారాల క్రితం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున రాజకీయంగా చురుకైన పాత్ర వహించారు. గ్రామంలోనే కాకుండా కల్లూరు మండల రాజకీయాల్లో హరిబాబు మంచి గుర్తింపు పొందారు. రాజకీయాల్లో చురుకుగా వ్యవహరించే హరిబాబు మృతితో కాంగ్రెస్ శ్రేణులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశాయి. ఆయన మరణం తీరని లోటని పలువురు కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించారు. హరిబాబుకు భార్య పద్మావతితో పాటుగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా వారికి వివాహం అయింది.

మాజీ మంత్రి జలగం, మట్టా సంతాపం



ముచ్చవరం మాజీ సర్పంచు హరిబాబు మృతితో సమాచారం అందుకున్న మాజీ మంత్రి జలగం ప్రసాదరావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్‌లు బుధవారం ఆయన నివాస గృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. హరిబాబు మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి, సంతాపం తెలిపారు. ఈ మేరకు సంతాపం తెలిపిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, ఏఎంసి చైర్మన్ బాగం నీరజదేవి, నాయకులు తక్కెళ్లపాటి ప్రసాద్, ఏనుగు సత్యంబాబు తదితరులు ఉన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ టెస్టింగ్ క్యాంప్

కొత్తగూడెం సాంస్కృతికం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని సేయింట్ జేవీఆర్ చర్చ్, సింగరేణి చిల్డ్రన్ పార్కులో భారత్ స్కౌట్ అండ్ గైడ్ టెస్టింగ్ క్యాంపును నిర్వహించారు. ఐదురోజులపాటు జరిగిన ఆ క్యాంపులో సింగరేణి ప్రాంతాలైన గోలేటి, మందమర్రి, గోదావరిఖని, భూపాలపల్లి, ఇల్లెందు, కొత్తగూడెం ఏరియాలకు చెందిన సింగరేణి ఇతర ప్రైవేట్ పాఠశాలల నుంచి 72మంది పది నుంచి 18 సంవత్సరాల్లోపు విద్యార్థులు శిక్షణ పరీక్షలో పాల్గొన్నారు. దేశ భక్తి, వ్యాయామం, క్యాంపు క్రాఫ్ట్ నిర్మాణం (ప్రకృతితో కలిసి జీవించడం) ప్రథమ చికిత్స, మెజర్‌మెంట్స్ అండ్ ఎస్టీమేషన్, ఆటలు, పాటలు తదితర అంశాలపై ప్రథమ, ద్వితీయ, తృతీయ శిక్షణ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారు గవర్నర్ అవార్డు టెస్టింగ్ క్యాంపునకు అర్హులు. మెరుగైన సమాజ నిర్మాణం కోసం సత్ప్రవర్తన కలిగిన పౌరులను తీర్చిదిద్దడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఎంతో దోహదపడతాయని క్యాంపు లీడర్ ఆఫ్‌ది ఫోర్స్ కె.భాస్కర్‌రావు తెలిపారు. చిన్నతనం నుంచే క్రమశిక్షణ, సమాజ సేవ వంటి అంశాలు అలవర్చుకుని ప్రకృతితో మమేకమై జీవనం సాగించే విధంగా విద్యార్థులు ఈ శిక్షణ పరీక్షల ద్వార నైపుణ్యం సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కమీషనర్ వి.వెంకటస్వామి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రంగారామ్, ఎం.మంగెన అశోక్, బి. ప్రకాష్, కె.కృష్ణ, యేసు, సుధాకర్, శక్తికుమార్, కుమారస్వామి, దిలీప్‌కుమార్, మహేష్, పి. సాయి నిరంజన్, రోవర్ లీడర్స్ ఎల్. గోపాలకృష్ణ, రామస్వామి, ఎం. కొమరయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు తయారుచేసిన రివాల్వింగ్ గేట్

క్రైం సమాచారం

ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

బూర్గంపాడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం సందెళ్లరామాపురం శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...బూర్గంపాడు మండల పరిధిలోని సందెళ్లరామాపురం గ్రామ శివారులో ఉన్న వాగు ఒడ్డున బుధవారం గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అటుగా పొలానికి వెళ్లిన వ్యక్తి గమనించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

బూర్గంపాడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం సందెళ్లరామాపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. దుమ్ముగూడెం మండలం రామారావుపేట గ్రామానికి చెందిన వర్షా చైతన్య(17) బూర్గంపాడు మండల పరిధిలోని సందెళ్లరామాపురం గ్రామంలో గల బంధువుల ఇంటి వద్ద ఉంటూ కృష్ణసాగర్‌లోని ఐటీఐ కళాశాలలో ఐటీఐ చదువుతున్నాడు. బుధవారం ముసలిమడుగు గ్రామానికి చెందిన ఆతుకూరి రాకేష్ అనే యువకుడుతో కలిసి ద్విచక్ర వాహనంపై ముసలిమడుగు వెళ్లాడు. తిరిగి సందెళ్లరామాపురం వెళ్తుండగా ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో లక్ష్మీపురం నుంచి ఐటీసీ కర్మాగారానికి వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ఇరువురు లారీ క్రింద పడిపోయారు. ప్రమాదంలో చైతన్య అక్కడికక్కడే మృతి చెందగా రాకేష్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి వీరస్వామి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాల్వలో పడి వ్యక్తి..

తల్లాడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం రంగంబంజర వద్ద నాగార్జునసాగర్ ప్రాజెక్టు(ఎన్నెస్పీ) మైనర్ కాల్వలో పడి బుధవారం తెల్లవారుజామున వ్యక్తి మృతిచెందాడు. కల్లూరు మండలం బాలాజీనగర్‌కు చెందిన కాళ్ల నాగేశ్వరరావు(55) మృతిచెందాడు. బుధవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకొని పోలీసులు కాల్వలోని మృతదేహాన్ని వెలికితీశారు. కుమారుడు శివసుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు తల్లాడ ఎస్ఐ బి.కొండల్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వ్యక్తి..

కల్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లింగాల గ్రామంలోని ఓ చెరువులో ప్రమాదవశాత్తు కాలు జారిపడి బుధవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. మండల పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన తాళ్ల శ్రీనివాసరావు(48) ఉదయం గ్రామ సమీపాన గల కొత్త చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లగా, ప్రమాదవశాత్తు కాలు జారి పడి నీటమునిగి మృతి చెందాడు. ఈ విషయాన్ని కాలిబాటన వెళ్లే రైతులు గమనించగా చెరువు గట్టుపై చెప్పులను గుర్తించి స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో గ్రామస్థులు శ్రీనివాసరావు మృతదేహాన్ని బయటకు వెలికితీశారు. కాగా శ్రీనివాసరావు సిరిసిల్ల జిల్లాలో చేనేత శాఖలో డీవోగా పనిచేస్తున్నాడు. లింగాల గ్రామంలో బంధుమిత్రులను కలిసి వెళ్లేందుకు తన స్వగ్రామానికి రాగా ఈ దుర్ఘటన జరిగింది. మృతుడికి భార్యతో పాటుగా ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

దమ్మపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఖమ్మం వైద్యశాలలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి బుధవారం మృతి చెందాడు. దమ్మపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దమ్మపేట పరిదిధిలోని బంజార కాలనీకి చెందిన అయినవెల్లి నాని (28) మరొక మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్థాపం చెందిన నాని మంగళవారం రాత్రి గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు దమ్మపేట ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స కోసం ఖమ్మం వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ వైస్ ఎంపీపీ మృతి

టేకులపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఇల్లెందు-కొత్తగూడెం ప్రధాన రహదారిపై మండలంలోని బోరింగ్‌తండా సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని సులానగర్ గ్రామానికి చెందిన టేకులపల్లి మండల పరిషత్ మాజీ వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉండేటి ప్రసాద్(55) మృతి చెందాడు. టేకులపల్లి పోలీసుల కథనం ప్రకారం ప్రసాద్ కొత్తగూడెం వైపు నుంచి ఇంటికి సులానగర్‌కు మోటారు సైకిల్‌పై వస్తుండగా ఇల్లెందు వైపునుంచి ఎదురుగా వస్తున్న మరో మోటారు సైకిల్ బోరింగ్‌తండా సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాధంలో ఉండేటి ప్రసాద్ తలకు తీవ్రగాయాలయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులకు కూడ తీవ్రగాయాలయ్యాయి. వారిని వెంటనే 108వాహనం ద్వారా కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. టేకులపల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ బావిలో పడి డ్రైవర్ మృతి

బోనకల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబీరవల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో గల పత్తి పొలంలో ట్రాక్టర్‌తో పని చేస్తున్న క్రమంలో బుధవారం ఇంజన్‌తో సహా వ్యవసాయ బావిలో పడి డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం వైరా మండలం పాలడుగు గ్రామానికి చెందిన కంచెపోగు మంగరాజు(24) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన వనమా రమేష్ పొలంలో పత్తి కట్టెను కుప్పలు వేసేందుకు వెళ్లాడు. ఇంజన్‌కు వెనుక ఉన్న గొర్రుతో కట్టెను నెడుతుండగా రాయి పట్టింది. వెనుకకు గట్టిగా రివర్స్ చేసిన క్రమంలో ప్రమాదవశాత్తూ బావిలో ఇంజన్‌తో సహా పడ్డాడు. నీట మునిగి అక్కడిక్కడే మృతి చెందాడు. జేసీబీ సహాయంతో బయటకు తీశారు. మృతుడు అవివాహితుడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ అద్దంకి ఆనంద్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

పక్షులు, జంతువులకు తాగునీరు



ఖమ్మంసంక్షేమవిభాగం,మార్చి19(ఆంధ్రజ్యోతి) వేసవి తీవ్రత అధికంగా పెరగటంతో పక్షులు, జంతువులకు తాగునీటి ఎద్దడి రాకుండా ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు ఏర్పాట్లు చేశారు. నగరంలోని పార్కులు, ఉద్యాన వనాలు, పక్షలు నివాసం ఉండే వృక్షాల వద్ద తాగునీటితొట్లును ఏర్పాటు చేశారు. రోజు ఉదయం, సాయంత్రం సమయంలో ఈ నీటితొట్లులో నీరు పోసేందుకు ప్రత్యేకంగా పారిశుధ్య కార్మికులను కేటాయించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ముందడుగు

- సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌లో నాలుగో స్థానం నుంచి మూడుకు..
- వరంగల్, గ్రేటర్ హైదరాబాద్ తర్వాత ఖమ్మం
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు షోకాజ్‌లు
- కొనసాగుతున్న బృందాల పరిశీలన



ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ 2025 అవార్డు పోటీలో ఖమ్మంనగర పాలక సంస్థ ముందడుగులో వెళ్లోంది. సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌లో రాష్ట్రంలో నాలుగోస్థానం నుంచి మూడోస్థానానికి చేరింది. బుధవారానికి వరంగల్‌లో 75,934 సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌లు, గ్రేటర్ హైదరాబాద్‌లో 17,709 ఫీడ్‌బ్యాక్‌లురాగా ఖమ్మంనగర పాలక సంస్థలో 12,776 ఫీడ్‌బ్యాక్‌లు ఆన్‌లైన్ జరిగాయి. రెండు రోజులుగా మెప్మాలోని టీఎంసీ, సీవోలు, ఆర్పీలు ప్రత్యేకంగా సిటీజన్ ఫీడ్‌బ్యాక్‌పై ప్రజలను కలిసి వారి సెల్‌ఫోన్ల నుంచి ఫీడ్‌బ్యాక్ నమోదు చేస్తుండటంతో 2వేల ఆన్‌లైన్ ఫీడ్ బ్యాక్‌లు పెరిగాయి. దీంతో నాలుగో స్థానం నుంచి మూడో స్థానానికి ఖమ్మం నగర పాలక సంస్థ చేరింది. కాగా పారిశుధ్య విభాగంలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు సిటీజన్ ఫీడ్‌బ్యాక్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో మల్లయ్య, యల్లస్వామి, భీమయ్యకు కమిషనర్ అభిషేక్ అగస్త్య షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తర్వాత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జవాన్లపై చర్యలు తీసుకున్నారు. మొత్తం 50 వేల వరకు ఫీడ్‌బ్యాక్‌లు వరకు ఆన్‌లైన్ జరిగితే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 750 మార్కులకు దక్కుతాయి. కాగా ఆర్పీలు ఫీడ్‌బ్యాక్ చేసే సమయంలో సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీలను ప్రజలు చెప్పేందుకు నిరాకరించటంతో కొంత జాప్యం జరుగుతుంది. ప్రజలు ఎటువంటి అపోహలు చెందకుండా ఓటీపీలు చెప్పాలని కేఎంసీ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

కొనసాగుతున్న ఢిల్లీ బృందాల పరిశీలన

స్వచ్ఛ సర్వేక్షణ్ క్షేత్రస్థాయిలో పరిశీలనకు ఢిల్లీబృందాల పరిశీలన ఖమ్మం నగరంలో జరుగుతుంది. బుధవారం 19, 23, 26, 30, 33, 39, 40, 54, 55లో పరిశీలన చేశారు. రహదారుల పరిశుభ్రత, డ్రెయినీల పరిశుభ్రత, రహదారుల పక్కన వ్యర్థాల నిర్వాహణ, చెత్త కుప్పలు పరిశీలన, తడి, పొడి చెత్త సేకరణ విధానం, సిటిజన్ ఫీడ్‌బ్యాక్ నేరుగా తీసుకుంటున్నారు. మరుగుదొడ్ల నిర్వాహణ, వ్యర్థాల నిర్వహణను పరిశీలిస్తున్నారు. వీరికి ఖమ్మం నగర పాలక సంస్థ నుంచి సమన్వయకర్తగా ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీనివాస పనిచేస్తున్నారు.

మున్నేరు రక్షణ గోడల నిర్మాణానికి

భూసేకరణ పూర్తి చేయాలి

- నిర్మాణ వేగం పెంచాలి
- పనులను పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మున్నేరు రిటైనింగ్ వాల్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్,మార్చి19(ఆంధ్రజ్యోతి): మున్నేరునదికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు అవసరమైన భూసేకరణ పూర్తి చేసి, పనులు మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి పోలేపల్లి వద్ద మున్నేరుపై జరుగుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు, వాల్ కోసం భూసేకరణ పురోగతి, మున్నేరు భూనిర్వాసితులకు ప్రభుత్వం ఇచ్చే స్థలం, మున్నేరు యాక్వీడేట్‌ను పరిశీలించారు. నాణ్యత, నిర్మాణంలో మెటీరియల్, వాల్ క్యూరింగ్ విషయాలలో పాటించాల్సిన జాగ్రత్తలను కలెక్టర్ అధికారులకు, గుత్తేదారులకు వివరించారు. రిటైనింగ్‌వాల్ ప్రక్కన మున్నేరు ఉన్నది అనే ఆనవాళ్ళు పోకుండా నిర్మాణంలో చర్యలు తీసుకోవాలని సూచించారు. భూములు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూమిని ఇచ్చి వారికి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ యం. వెంకటేశ్వర్లు, డీఈ. రమేష్, ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, ఆర్ఐ. క్రాంతి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ప్రతిరూపమే పార్లమెంట్ వ్యవస్థ

ఖమ్మంఖానాపురంహవేలి: ప్రజాస్వామ్యానికి ప్రతిరూపమే పార్లమెంట్ వ్యవస్థ అని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీకళాశాలలో నిర్వహించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.వి. రమణారావు, శ్రీకవితా ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ కోట అప్పిరెడ్డి, జిల్లాఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎన్.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన ఉండాలి



బహుమతులు అందజేస్తున్న టీబీ సూపర్‌వైజర్ ఉపేందర్

ఖమ్మంకలెక్టరేట్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిపై అవగాహన పెంపొందించుకోవాలని ఇది ఎలా సంక్రమిస్తుంది, ఇది ఒకరి నుంచి ఒకరికి సంక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బుధవారం రామన్నపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా స్కూల్‌లో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, నివారణపై ఖమ్మం టీబీ నివారణ పర్యవేక్షకులు ఉపేందర్ తెలియచేశారు.వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో క్షయవ్యాధి నివారణ సిబ్బంది రామకృష్ణ, ఉపేందర్,ఎం.వెంకటపాలెం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది చిలకమ్మా,మాణిక్యం పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగ కల్పన దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి మార్చి19(ఆంధ్రజ్యోతి): నగరంలోని టేకులపల్లి ప్రభుత్వ ఐటీఐలో విదేశాలలో ఉద్యోగ కల్పనకు దరఖాస్తులను ఈనెల 21లోపు కళాశాలలో అందించాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. నిరుద్యోగులకు ఒవర్సిస్ మాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో కార్మిక ఉపాధి శిక్షణ అందిస్తుందని తెలిపారు. అర్హత కలిగిన 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాలలోపు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

లబ్ధిదారుల ఎంపికలో అధికారులే కీలకం

- కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య
- ఇందిరమ్మ ఇళ్లపై జిల్లా అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల తొలి విడతలో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియలో జిల్లా అధికారులే కీలకంగా పనిచేయాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు. బుధవారం కేఎంసీలో 30 మంది ప్రభుత్వశాఖల జిల్లా అధికారులతో కమిషనర్ రివ్యూ నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను వివరించారు. ఎల్1 జాబితాలో తొలి విడతగా రేషన్‌కార్డు కలిగి ఉండి, సొంత ఇంటి స్థలం ఉన్న లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలన్నారు. జిల్లా అధికారులకు కేఎంసీ నుంచి వార్డు ఆఫీసర్లు, ఇతర ఉద్యోగులు సహాయకులుగా నియామకం చేసినట్లు తెలిపారు. లబ్ధిదారుల ఆర్థిక స్థితిగతులు, వాస్తవ పరిస్థితులు, అర్హతలను జిల్లా అధికారులే పరిశీలించాలని సూచించారు. తొలివిడతలో అత్యంత నిరుపేదలకు ఇస్తామని, మలి విడతలో మిగిలిన లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. వారం రోజుల్లో నగరంలోని 5,457 మంది ఎంపిక పూర్తి కావాలన్నారు. ప్రతీ జిల్లా అధికారికి 200 మంది జాబితాలను అందిస్తున్నామనితెలిపారు.

సర్వే బృందాలకు శిక్షణ

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హులనే గుర్తించాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక సర్వేకు కేటాయించిన ప్రత్యేకఅధికారులకు బుధవారం కమిషనర్ శిక్షణ ఇచ్చారు.ఎల్1నుంచి ఎల్2, ఎల్3 వరకు ఎంపిక ప్రక్రియను వివరించారు. క్షుణంగా పరిశీలన చేయాలన్నారు. స్థలాల ధ్రువపత్రాలు ఉన్నాయా అనే విషయాలను పరిగణించాలని ఆదేశించారు. లబ్ధిదారుల పేర్లు మాత్రమే ఉండి ఇంటి నెంబర్లు లేకపోతే స్థానిక జవాన్ మెప్మా రిసోర్స్ పర్సన్స్ సహాయం తీసుకోవాలని సూచించారు. ప్రతీ డివిజన్ వారీగా ఇళ్లలబ్ధిదారుల జాబితాలను బృందాలకు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఎల్ 1 పరిశీలన తర్వాత ఎల్ 2, ఎల్ 3 సర్వే జరిగిన తర్వాతనే తుది ఎంపిక జరుగుతుందని కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. గృహనిర్మాణశాఖ ఈఈ శ్రీనివాస్, టీఎంసీ గుడిపూడి శారదారాణి, సీవోలు ఉపేంద్ర, సల్మా, ద్రౌపతి, రోజా, కేఎంసీ వార్డు ఆఫీసర్లు, బిల్‌కలెక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ చైర్స్ అందజేత



ఖమ్మంవ్యవసాయం, మార్చి19(ఆంధ్రజ్యోతి): పాండురంగాపురంలోని2,4, డివిజన్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న పిల్లలకు డాక్టర్ గొంగుర వెంకటేశ్వర్లు,లయిన్ బొల్లి శ్రీనివాస్ సహాయంతో స్టడీచైర్లను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు రాకేష్ దత్త బుధవారం అందజేశారు.ఈకార్యక్రమంలోసాయి గౌతమ్, రంజిత్ పగిండ్ల, డివిజన్ యూత్ నాయకులు జక్కుల రాజేష్, వేముల శ్రావణ్, జిలకర సురేష్, బీసీటౌన్ ప్రెసిడెంట్ గోనే శ్రీశ్రీ, వీరేష్ సంతోష్ , రమేష్ పాల్గొన్నారు.

కూసుమంచి సంత రూ.3.61లక్షలు

కూసుమంచి,మార్చి 19(ఆంధ్రజ్యోతి): కూసుమంచిలోని వారపుసంత వేలం ఖరారయింది. ధర్మాతండాకు చెందిన జర్పుల నాగేశ్వరరావు రూ.3.61 లక్షలకు కైవసం చేసుకున్నారు. 2025-26 సంవత్సరానికిగాను కూరగాయల సంత ప్రతీ సోమవారం జరుగుతుంది. 14మంది పాటదారులు పాల్గొన్నారు.

వర్గీకరణను నిరసిస్తూ ఉద్యమాలు

ఖమ్మంకలెక్టరేట్, మార్చి19(ఆంధ్రజ్యోతి): ఎస్సీవర్గీకరణను నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేద్దామని మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి పేరం మల్లయ్య, నగర అధ్యక్షుడు తలారి రాధాకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఎస్సీలను అణగదొక్కే కుట్ర జరుగుతుందన్నారు.

సమస్యలపై పోరాటాలు

తిరుమలాయపాలెం, మార్చి19(ఆంధ్రజ్యోతి):ప్రజాసమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ తెలిపారు. బుధవారం తిరుమలాయపాలెంలో పార్టీకార్యాలయంలో పద్మనాభుల సుధాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లానాయుకలు బషీరుద్దీన్, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను టి.నాగేశ్వరరావు, సుగుణమ్మ, మంగతాయి పాల్గొన్నారు.

సేవాభావం కలిగి ఉండాలి

తిరుమలాయపాలెం, మార్చి19(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతీ ఒక్కరు కూడా సేవాభావం కలిగి ఉండి సమాజాభివృద్ధికి కృషి చేయాలని తహసీల్దార్ పీవీ రామకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన కాంపాటి బాబురావు తల్లిదండ్రులు వీరస్వామి-పిచ్చమ్మ జ్ఞాపకార్థం వైకుంఠరథాన్ని గ్రామపంచాయతీకి అందించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సిలార్‌సాహెబ్ కార్యదర్శి సుజాత, చామకూరి వెంకన్న, కాంపాటి రామారావు, భాస్కరాచారి పాల్గొన్నారు.

బదిలీ అధికారులకు సన్మానం

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి19(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రీజియన్ అభివృద్ధిలో భాగస్వాములై బదిలీపై వెళ్లుతున్న డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్) పవిత్ర, డిప్యూటటీ రీజనల్ మేనేజర్ (మెకానికల్) ఎస్ భవాని ప్రసాద్‌ను బుధవారం నగరంలోని ఆర్ఎం కార్యాలయంలో సన్మానించారు.

శ్రీసాయిమందిర వార్షికోత్సవం

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని సారధినగర్‌లోని శ్రీసాయి జ్ఞాన మందిర 25వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆ కార్యక్రమానికి డివిజన్ మాజీ కార్పొరేటర్ తోట రామారావు హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పాఠశాల స్థల పరిశీలన

ఖమ్మంరూరల్,మార్చి19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్నేకల్లు వద్ద ప్రభుత్వం నిర్మిస్తున్న యంగ్ ఇండియా పాఠశాలను నిర్మించబోయే స్థలాన్ని రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గణపతిరెడ్డి బుధవారం అధికారులతో కలిసి సందర్శించారు. 21ఎకరాలను పరిశీలించారు. పాఠశాల నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు.ఈకార్యక్రమంలోసూపరింటెండెంట్ ఇంజనీర్ షఫీమియా, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ విన్సెంట్‌రావు, ఏఈ సురేందర్ రెడ్డి, తహశీల్దార్ రాంప్రసాద్, ఆర్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

బోజెడ్ల కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొంగులేటి

ఖమ్మంరూరల్ మార్చి19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోనిమంగళగూడెం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బోజెడ్ల శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు.ఈ విషయం తెలుసుకున్న మంత్రి పొంగలేటి శ్రీనివాసరెడ్డి బుధవారం రాత్రి వారి ఇంటికివెళ్లి శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులు కుమారుడు బొజెడ్ల రవికుమార్‌ను ఓదార్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటరెడ్డి, కన్నేటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. 19కేపీ 4 శిఖరములపై



శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి

పదునెట్టాంబడిపై పడిపూజ



ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి19(ఆంధ్రజ్యోతి): పదో డివిజన్ చైతన్యనగర్‌లో నూతనంగా నిర్మించిన ధర్మశాస్తా(అయ్యప్పస్వామి)దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలలో భాగంగా తొమ్మిదోరోజు బుధవారం ఉదయం కడుత్తస్వామి కరుప్ప స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. పదునెట్టాంబడిపై పడిపూజా కార్యక్రమం తక్కే కోరమంగళం దామో దరన్ నంబూద్రీ, పాతకల్లం నారాయణ నంబూద్రి నిర్వహించారు.

మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

నేలకొండపల్లి,మార్చి19(ఆంధ్రజ్యోతి): శాసనసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదింపచేయటం పట్ల హర్షం ప్రకటిస్తూ, వర్గీకరణకు కృషి చేసిన మంద కృష్ణ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం పాలాభిషేకం చేసారు. కార్యక్రమంలో పగిడికత్తుల ఈదయ్య, మాదాసు వెంకయ్య, పొట్టపింజర బాలస్వామి, గుడిపాటి ముక్కంటి, తోళ్ళ వెంకన్న, ముక్కంటి శ్రీను పాల్గొన్నారు.

నేడు పొంగులేటి పర్యటన

తిరుమలాయపాలెం,మార్చి19(ఆంధ్రజ్యోతి): మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం మండలంలో పర్యటించనున్నారని కాంగ్రెస్ నాయకుడు తుంబూరు దయాకరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



కోయచెలక పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంఈవో

రఘునాథపాలెం,మార్చి19(ఆంధ్రజ్యోతి): మండలంలో పదోతరగతి పరీక్షలకు పూర్తి ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో బీ.రాములు చెప్పారు. శుక్రవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.మంచుకొండ, కోయచెలకలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో మొత్తం 236మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఐదునిమిషాల ఆలస్యం జరిగినా అనుమతి ఇస్తారు. పరీక్షా కేంద్రాలను బుధవారం ఎంఈవో బీ.రాములు పరిశీలించారు.

నేలకొండపల్లి: మండలవ్యాప్తంగా మొత్తం 455 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. నేలకొండపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెర్వుమాధారంలలో సెంటర్లను ఏర్పాటు చేశారు. అన్ని మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి చలపతిరావు చెప్పారు.

డబుల్ బెడ్రూంలో మండల

జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలి

- కలెక్టర్‌కు టీడబ్ల్యూజేఎఫ్ వినతి



వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

ఖమ్మంకలెక్టరేట్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఖాళీగా ఉన్న డబుల్ బెడ్రూంలను ఆయామండలాల్లోని జర్నలిస్టులకు కేటాయించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్‌ను టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు పల్లా కొండల్‌రావు, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్ తదితరులు కలెక్టర్‌కలిసి విన్నవించారు. మండలాల్లో అందుబాటులో ఉన్నడబుల్ బెడ్రూంల కేటాయింపుల్లో జర్నలిస్టులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చేందుకు కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

రేషన్‌కార్డుల కోసం నేటినుంచి స్పెషల్ డ్రైవ్

గురువారం నుంచి జర్నలిస్టుల రేషన్ కార్డుల కోసంస్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. కలెక్టరేట్ మీసేవ కేంద్రం ద్వారా జర్నలిస్టులు గురు,శుక్ర,శనివారాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మీసేవ కేంద్రాల అకనాలెడ్జ్మెంట్ తీసుకొస్తే రేషన్‌కార్డు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సీఎం,పొంగులేటి చిత్రపటాలకు క్షీరాభిషేకం



నేలకొండపల్లిలో క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

నేలకొండపల్లి,మార్చి19(ఆంధ్రజ్యోతి):బీసీరిజర్వేషన్ల బిల్లును శాసనసభలో ఆమోదించటంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ శ్రేణులు క్షీరాభిషేకం చేశాయి.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన అన్నిహామీలను అమలు చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో వజ్జా రమ్య, లక్కం ఏడుకొండలు, రాయపూడి నారాయణరావు, బచ్చలకూరి నాగరాజు, కైలాసపు వెంకటేశ్వర్లు, షైసా శంకర్, మోర మల్లయ్య పాల్గొన్నారు.

విద్యావనరుల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రఘునాధపాలెం మండల విద్యాశాఖకు విద్యావనరుల కేంద్రం ఏర్పాటు చేయాలని పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం డీఆర్‌డీఏ పీడి సన్యాసయ్యకు వినతిపత్రం అందించారు. మండలంలో నిర్మించిన విద్యావనరుల కేంద్రంలో ఐకేపి విధులు నిర్వహిస్తున్నారన్నారు.

ఎస్‌బీఐ మేనేజర్‌కు ఉత్తమ పురస్కారం

కూసుమంచి,మార్చి19(ఆంధ్రజ్యోతి): కూసుమంచి ఎస్‌బీఐ మేనేజర్ వడిత్యా సురేందర్‌కు ఉత్తమపురస్కారం లభించింది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సీజీఎం రాజేశ్‌కుమార్ అందజేశారు. ఉత్తమ బ్యాంకింగ్, ఎక్స్‌లెంట్ పెర్ఫారెమన్స్ కింద అవార్డు లభించింది. లోక్యాతండాకు చెందిన సురేందర్ రెండున్నర సంవత్సరాలక్రితం కూసుమంచి బ్రాంచ్‌కు వచ్చారు.

చలివేంద్రం ప్రారంభం



చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కొణిజర్ల, మార్చి19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తనికెళ్లలో మెయిన్‌రోడ్డు వద్ద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రోజారాణి గ్రామపంచాయతీ కార్యదర్శి రవికుమార్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

సుబ్బయ్యకు నివాళులర్పించిన సండ్ర



సుబ్బయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సండ్ర దంపతులు

వేంసూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూళ్ల కొత్తూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఉప్పలపాటి సుబ్బయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతిచెందాడు. సుబ్బయ్య భౌతిక కాయాన్ని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య దంపతులు సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప్పలపాటి కృష్ణయ్య, సత్యనారాయణ, రాజు, కలపాల వాసు, శేఖర్, వి.వెంకటేశ్వరరావు, సుధాకర్, కూసంపూడి రామారావు, మహేష్, పగుట్ల వెంకటేశ్వరరావు, వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

సత్తుపల్లి, మార్చి19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని సత్తుపల్లి తహసీల్దార్ కే.యోగేశ్వరరావు బుధవారం పరిశీలించారు. సుమారు 100మందికి పైగా డేస్ స్కాలర్స్ మిడ్డే మీల్స్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేతిపంపు వితరణ

బోనకల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలో బుధవారం గ్రేస్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రజలకు తాగునీటి సౌకర్యార్థం చేతిపంపును వేయించి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఇటీవల మధిర, ఎర్రుపాలెం, చింతకాని మండలాల్లో తమ సంస్థ ద్వారా పదికి పైగా బోర్లు వేయించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాన్, ఎర్నెస్ట్‌పాల్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బోనకల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ 6,7,8,9 తరగతులలో ఖాళీగా ఉన్న (బ్యాక్ లాగ్) సీట్ల భర్తీకి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని బోనకల్ ఎంజేపీ ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి కోరారు. ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

రేషన్ కార్డులతో సంబంధం లేకుండా
దరఖాస్తులు తీసుకోవాలి

బోనకల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులతో సంబంధం లేకుండా రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తులు తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో తూము రోషన్ కుమార్, జక్కుల రామారావు, ఆకేన పవన్, ఏనుగు రవి కుమార్, కొంగర భాస్కరరావు, గుంపుల జయరాజు తదితరులున్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి : ఎంఈవో

బోనకల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలో పదవ తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో దామాల పుల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 396 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. సిరిపురంలో 44 మంది, నాగులవంచ కేంద్రాలలో 32మంది పరీక్షకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

కారేపల్లిలో...

కారేపల్లి, మార్చి19(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో ఎం.జయరాజ్ తెలిపారు. మొత్తం 565 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

ప్రమాదకరంగా వంతెన

» ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
» నూతన వంతెన నిర్మించాలని వినతి



రహదారికి సమానంగా ఉన్న వంతెన

సత్తుపల్లిరూరల్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): వాడుకలో లేని పాత ఎన్టీఆర్ కాలువ ప్రమాదకరంగా మారగా ఏళ్లనాటి వంతెన శిథిలావస్థకు చేరింది. అదేవిధంగా వంతెనకు ఇరువైపులా 20-30అడుగుల లోతులో మురుగు, బురద నీరు నిల్వ ఉండటంతో వాహనదారులతో పాటు సమీపంలోని చిన్నారులు, వృద్ధులకు ప్రాణసంకటంలా మారింది. ఒకప్పుడు ఇటువైపు రద్దీ లేకపోగా ప్రస్తుతంలో సమీపంలో సింగరేణి క్వార్టర్స్, కొమ్మేపల్లి కాలనీతో పాటు పలు జవహర్ నగర్‌లోని ఇళ్ల సముదాయాలు పెరిగిపోవడంతో జనాభా సంచారం ఎక్కువగా ఉంది. అయితే ఇరువైపులా కొంత దూరంలో సింగరేణి సంస్థ మట్టి తోలకాలు జరిపి పూడ్చివేయగా తామర చెరువు వరకు పూడ్చి వేసినట్లయితే రహదారి వెడల్పు కావడంతో పాటు సమీపంలోని ప్రజలకు దుర్వాసనతో పాటు దోమలు, ఈగల వ్యాప్తి లేకుండా ఉంటుందని, చెత్తాచెదారం వేయకుండా చేయవచ్చునని ప్రజాసంఘాలు చెబుతున్నాయి. దీంతో ఇక్కడ ఏళ్లనాటి వంతెనను నూతనంగా నిర్మించడంతో పాటు నీళ్ల నిండిన కాలువను వెంటనే పూడ్చివేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన బ్రిడ్జి నిర్మించాలి

● అద్దంకి అనిల్, మాజీ కౌన్సిలర్



ఏళ్ల క్రితం నిర్మించి ఈ బ్రిడ్జి స్థానంలో నూతన బ్రిడ్జిని నిర్మించాలి. పట్టణం పెరగడంతో పాటు ఈ ప్రాంతంలో సింగరేణి క్వార్టర్స్‌తో పాటు పలు కాలనీలు విస్తరించి ఉండడంతో బ్రిడ్జి అవసరం చాలా ఉంది. అంతేకాక ఈ బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన బ్రిడ్జిని నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

'ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలి'



జీఎంతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

సత్తుపల్లి, మార్చి19 (ఆంధ్రజ్యోతి): కిష్టారం ఓసీలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని 51రోజులు ముందుగానే సాధించినందుకు ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజును కోరారు. బుధవారం కిష్టారం ఓసీలో నిర్వహించిన స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో పలు సమస్యలను ఆయన ముందుంచామన్నారు. జీకే ఓసీ నుంచి సత్తుపల్లికి పర్మినెంట్, డిప్యూటేషన్‌పై వెళ్లిన వారిని తిరిగి తీసుకురావాలని, రుద్రంపూర్ డిస్పెన్సరీలో మహిళ వైద్యాధికారిని నియమించాలని, ఫిజియోథెరపీ తదితర సమస్యలను విన్నవించారు. వీటిపై సానుకూలంగా స్పందించిన జీఎం పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జే.గట్టయ్య, సుమద్రాల సుధాకర్, హుమాయిన్, భరణి తదితరులున్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నా

కల్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని కల్లూరులో బుధవారం ఎంపీడీవో కార్యాలయం ముందు గ్రామ పంచాయితీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ యూనియన్ జిల్లా నాయకుడు రాజశేఖర్ మాట్లాడారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వారు ఎంపీడీవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేము రాంబాబు, దామాల దయాకర్, శేషగిరిరావు, అరిగల బసవయ్య, ఏలూరి శ్రీనివాసరావు, కోలా వెంకట్ తదితరులున్నారు.



ఎంపీడీవోకు వినతి పత్రం అందిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

కొత్త ఓటర్లను చేర్పించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

వైరా, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కొత్త ఓటర్లను చేర్పించేందుకు తమవంతు సహకారం అందించాలని రాజకీయ పార్టీల నాయకులకు వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం వైరాలోని తమ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. పలు పార్టీల నాయకులు గుగులోతు రాము, మద్దెల రవి, షేక్.లాల్‌మహ్మద్, భూక్యా వీరభద్రం, కొంగర సుధాకర్, కిలారు సురేందర్, శ్రీనివాసరావు, యామాల గోపాలరావు, సంగమేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం ఆశయాలు సాధించాలి

బోనకల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణా సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం 3వ వర్ధంతి సందర్భంగా బోనకల్‌లో బుధవారం సీపీఎం నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కిలారు సురేష్, దొండపాటి నాగేశ్వరరావు, తెల్లాకుల శ్రీనివాసరావు, ఉప్పర శ్రీను, బందం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

చింతకాని, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మత్కేపల్లి నామవరం గ్రామంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు అందజేశారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు చెక్కులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కంచం కోటేశ్వరరావు, బండెల నాగార్జున, వలమల రామారావు, తిరుపతి అంజయ్య, గోద ప్రసాద్, నర్సింశెట్టి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న నాయకులు

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం



సత్తుపల్లిలో మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): ఏబీసీ వర్గీకరణ సాధించుకోవడం ఆనందంగా ఉందని, ఈ విజయం మాదిగజాతికి అంకితమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో గొల్లమందల ముత్తారావు, గోళ్లమూడి శ్రీనివాసరావు, పరిగడపు లక్ష్మణ్, దువ్వూరు రమేష్, సాధు సుధాకర్, జే.జగన్నాథం, బాలస్వామి, గద్దల దేవన్న, రాఘవ, ఎస్.శివ, నాగేశ్వరరావు, పుల్లారావు పాల్గొన్నారు.

బోనకల్‌లో...

బోనకల్: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్దత కల్పించినందుకు గానూ బుధవారం బోనకల్‌లో ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చిలక నాగరాజు, ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట హన్మంతరావులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తోట చిన సైదులు, బలవంతపు నర్సింహారావు, మందా అశోక్, తోటపల్లి సాల్మన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూర్‌లో..

ఏన్కూరు: ఎస్సీ వర్గీకరణ విజయాన్ని హర్షిస్తూ బుధవారం ఏన్కూరులో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు సంబరాలు చేశారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు యంగల నరేష్, దామెర్ల వీరయ్య, పూర్ణకంటి నాగరాజు, భాగం రమేష్, నర్సింహారావు, కృష్ణ, గోపి పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో...

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ దగ్గర గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు కూరపాటి ప్రభాకర్, గట్టిగుండే కిషోర్, దేవరకొండ కోటేశ్వరరావు, దోమందుల సామేలు, మిరియాల నాగేశ్వరరావు తదితరులున్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి: సీపీఎం

ముదిగొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం మాట్లాడారు. కార్యక్రమంలో మంకెన దామోదర్, ఇరుకు నాగేశ్వరరావు, కల్యాణ్, బట్టు రాజు, భద్రయ్య, దస్తగిరి, సతీష్, లక్ష్మణ్, మందరపు వెంకయ్య, ధర్మయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భట్టి విక్రమార్క చిత్రపటానికి క్షీరాభిషేకం



భట్టి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముదిగొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ 42శాతం బిల్లును ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముదిగొండ కాంగ్రెస్ బీసీ సెల్ తరపున డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీసీసెల్ మండల అధ్యక్షుడు పల్లపాటి కృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో కొమ్మినేని రమేష్‌బాబు, బులెట్‌బాబు, పల్లపాటి కృష్ణ, పసుపులేటి దేవేంద్రం, రవీందర్‌రెడ్డి, నర్సింహారావు, అజ్గర్, భిక్షం, భద్రారెడ్డి, రాంబాబు, శంబయ్య, రాఘవ, రామకృష్ణ పాల్గొన్నారు.

తల్లాడలో....

తల్లాడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ వర్గీకరణ బిల్లును శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదించినందుకుగానూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం తల్లాడలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఖురాన్ పఠనంపై అవగాహన సదస్సు

కల్లూరు, మార్చి19 (ఆంధ్రజ్యోతి): ఖురాన్ పఠనంతో మానవుడు స్వర్గ ప్రాప్తి పొందుతాడని కల్లూరు జామే మసీద్ అలీమ్ యండి. ఇంతియాజ్ అన్నారు. బుధవారం కల్లూరు పట్టణంలో రంజాన్ మాసం సందర్భంగా ఖురాన్ పఠనంపై ముస్లిం మహిళలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇంతియాజ్, మత ప్రబోధకుడు యస్‌కె ఇమామ్, సయ్యద్ కమ్లి, ఆసిఫ్, ఎండి. ఖాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



ఏన్కూర్‌లో ప్యాడ్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

ఏన్కూరు, మార్చి19(ఆంధ్రజ్యోతి): ఇష్టంతో కష్టపడి చదివి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని బురదరాఘవాపురం ఉన్నత పాఠశాల హెచ్ఎం సాగి సుజాత అన్నారు. బుధవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా కానిస్టేబుల్ శ్రీనివాసరావు విద్యార్థులకు పరీక్ష సామగ్రి, ప్యాడ్లు,పెన్నులు,పెన్సిళ్లు అందించారు. ఈకార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం శ్రీనివాస్, ఎస్ఎంసీ ఛైర్మన్ హేమలత, ఉపాధ్యాయులుపొట్ట రామారావు, శ్రీనివాసరావు, పుల్లయ్య, విజయశ్రీ, నాగేశ్వరరావు, నరేష్, భారతి, బావ్‌సింగ్, కృష్ణ పాల్గొన్నారు.

వైరాలో....

వైరా: మండలంలోని రెబ్బవరం హైస్కూల్లో ఈ ఏడాది పదోతరగతి చదువుతున్న 43మంది విద్యార్థులకు రూ.5,500విలువైన స్టీల్ వాటర్‌బాటిల్స్‌ను బుధవారం అదే పాఠశాలలో పని చేస్తున్న దొడ్డా వరప్రసాదరావు తన సతీమణితో కలిసి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు, పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్మన్ తులిశమ్మ, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు గంగవరపు వెంకట్రావ్, ఉపాధ్యాయులు కిరణ్, లలిత, శ్రీనివాసరావు, వేదన, జీవీ.సూర్యప్రకాశరావు, నర్సింహారావు, చంద్రశేఖర్, మోహన్‌రావు, భవాని, సరస్వతి, భాగ్యలక్ష్మి, లక్ష్మి, శ్రీలత పాల్గొన్నారు.

చింతకానిలో...

చింతకాని, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలోని కస్తూర్బా బాలికల పాఠశాల విద్యార్థులకు కిలారు మనోహర్‌బాబు, నేరడ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పరీక్ష సామాగ్రిని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ జిల్లా కమిటీ సభ్యుడు కొప్పుల గోవిందరావు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, చావా దుర్గాభవాని, టీ చంద్రశేఖర్, భాగ్య, కృష్ణారావు, రామనరసింహారావు పాల్గొన్నారు.

తల్లాడలో...

తల్లాడ: మండలం అన్నారుగూడెం ఉన్నత పాఠశాలలో బుధవారం పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.దామోదర్‌ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు గిరిజారాణి, ఉపాధ్యాయులు శారదాదేవి, మురళీకృష్ణ, స్వరాజ్యలక్ష్మీ, రత్నకుమారి, రామారావు పాల్గొన్నారు.

బోనకల్‌లో...

బోనకల్: మోటమర్రిలో గ్రామ కార్యదర్శి భూక్యా రాకేష్ జామెట్రి బాక్సులు, ప్యాడ్లను ఎంఈవో దామాల పుల్లయ్య చేతుల మీదుగా అందజేశారు. చిరునోములలో మాగి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మాగి ముఖేష్ పెన్నులు, ప్యాడ్లను వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు దుర్గా ప్రసాద్, లోవెల్ కుమార్, మాజీ డీసీసీబీ డైరెక్టర్ బోజెడ్ల అప్పారావు, గుత్తా శ్రీను, కొమ్ము శ్రీను, నారాయణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



వైరాలో వాటర్ బాటిల్స్‌ను అందజేస్తున్న దొడ్డా వరప్రసాదరావు దంపతులు



తల్లాడలో పరీక్ష సామగ్రిని అందిస్తున్న దృశ్యం

జీవో 64ను రద్దు చేయాలి: సీపీఎం



మాట్లాడుతున్న భూక్యా వీరభద్రం

కొణిజర్ల, మార్చి19(ఆంధ్రజ్యోతి): డైలీవేజ్ వర్కర్ల కనీసం వేతన చట్టం అమలు చేయకుండా, వారి పొట్టకొట్టే జీవో 64ను అమలు చేయడం దారుణమని, వెంటనే ఆ జీవోను రద్దు చేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, సీపీఎం జిల్లా నాయకుడు తాళ్లపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని బస్వాపురం వద్ద గిరిజన బాలుర హాస్టల్ వద్ద సమ్మెలో ఉన్న కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నవరపు వెంకటేశ్వర్లు, మాధవరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాలతి ఆశయాలను సాధించాలి

» సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శిర వర్గ సభ్యుడు మధు

కొణిజర్ల, మార్చి19(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధి కోసం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన ఉద్యమనాయకురాలు మాలతి అని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు కొనియాడారు. మండల పరిధిలోని రామనర్సయ్యనగర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన బానోతు మాలతి సంస్మరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆంగోతు భాష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, కోలా లక్ష్మీనారాయణ, విప్లవకుమార్, లక్ష్మక్క, షేక్ ఖాసీం, గిరి, పటాన్ ఖాసీంఖాన్, శంకర్, ఉపేందర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'రైతుల సమస్యలు పరిష్కరించాలి'

కొణిజర్ల, మార్చి19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలతో బాధపడుతున్న అన్నంపెట్టే అన్నదాతల సమస్యలను పట్టించుకోవాలని భారతీయ కిసాన్‌సంఘ్ కొణిజర్ల మండల అధ్యక్షుడు బండారు సత్యనారాయణ కోరారు. బుధవారం విద్యుత్ సమస్యలపై వరంగల్ కలెక్టరేట్‌లో ఈఆర్‌సీ సమావేశాన్ని నిర్వహించారు. ఆ సమావేశానికి సత్యనారాయణకు కూడా ఆహ్వానం అందింది. దాంతో అతడు అక్కడ సమావేశంలో పాల్గొని మండలంలోని విద్యుత్ సమస్యలపై మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్లకు కరెంట్ కోసం స్తంభాలు వేసి ఇంతవరకు వైరులాగలేదని తెలిపాడు. పలు సమస్యలను ఈఆర్‌సీ సమావేశం దృష్టికి తీసుకెళ్లారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

వేంసూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలం లక్ష్మీనారాయణపురం(తాటాకులగూడెం)లోని శ్రీసత్య అభయాంజనేయస్వామి ఆలయ 19వ వార్షికోత్సవ వేడుకలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు, హోమం పూజలు, ఆతర్వాత హనుమత్ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



పూజలు చేస్తున్న అర్చకులు

ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న గణపతిరెడ్డి

బోనకల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేసిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థలాన్ని బుధవారం టీజీఈడబ్ల్యూఐడీసీ(తెలంగాణ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఎండీ గణపతిరెడ్డి, ఈఈ షఫీమీయాలు పరిశీలించారు. పాఠశాలల నమూనాకు సంబంధించి చర్చించారు. 30 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టనున్న నిర్మాణాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, గిర్దావర్ మైథిలీ తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ ప్రాణాలు కాపాడిన పోలీసులు

పెనుబల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మార్గమధ్యలో లారీడ్రైవర్‌కు గుండెనొప్పి రావడంతో పోలీసు లు సకాలంలో స్పం దించడంతో డ్రైవర్ ప్రాణాలతో సురక్షితంగా బయటపడ్డాడు. ఈ సంఘటన బుధవారం వీఎంబంజర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చింతలపూడి మండలం గోపారం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ డ్రైవర్ మొగళ్లపు కృష్ణారావుకు పెనుబల్లి సమీపంలో గుండెనొప్పి రావడం తో లారీని పక్కకు ఆపి రోడ్డుపక్కన ఉన్న వారిని సహాయం చేయాలని అర్థించడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ పెంటయ్య, కానిస్టేబుళ్లు పుల్లారావు, రాఘవరావు కలిసి పోలీసు వాహనంలోనే డ్రైవర్‌ను పెనుబల్లి ఆసుపత్రికి తరలించి వైద్యం అందించడంతో కృష్ణారావు ప్రాణాపా యం నుంచి బయటపడ్డాడు.